ఆకలితీర్చిన అమృతమూర్తి !

- సత్యసాయి జయంతి వేడుకల్లో లక్షలాది మందికి అన్నదానం
- శత జయంత్యుత్సవాలకు భారీగా తరలిరానున్న భక్తులు
- పెద్ద ఎత్తున నారాయణ సేవకు చర్యలు

6


నారాయణసేవ అందిస్తున్న సత్యసాయి (ఫైల్)

నేటి నుంచి సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

- పుట్టపర్తిలో పెరిగిన భక్తుల సందడి
- వేడుకలకు రానున్న రాష్ట్రపతి, ప్రధాని (వివరాలు మెయిన్‌లో...)

విధులను పంచేస్తేనే మేలు..!

కొందరిపైనే పని భారం | మిగిలిన వారికి సరదాగా ఉద్యోగం

ఆంధ్రజ్యోతి పరిశీలన

- సగానికిపైగా ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇదీ పరిస్థితి
- విజన్ యూనిట్‌లోనైనా తీరు మారుతుందా..?

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో చాలామందికి విధులు సరదాగా మారాయి. తీరిగ్గా 11 గంటలకు కార్యాలయానికి వెళ్లి హాజరు వేసుకుని వెళ్లిపోతే చాలు.. నెల నెలా జీతం తీసుకోవచ్చు. కానీ కొందరికి మాత్రం తీరిక లేనంత పని ఉంటోంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఒక్కో సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి ఈ నెల పదో తేదీన ఉదయం నుంచి సాయంత్రం వరకూ పరిశీలించింది. ఆ సమయంలో (మిగతా 6వ పేజీలో..)


అనంతపురం రూరల్ పంచాయతీలో ఒక్కరే..

- శింగనమల నియోజకవర్గ కేంద్రంలోని సచివాలయ ఉద్యోగుల తీరు మరీ దారుణంగా ఉంది. సోమవారం ఉదయం 10.30 గంటలైనా ఏ ఒక్క ఉద్యోగీ సచివాలయానికి రాలేదు. కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఆ తరువాత గ్రామ రెవెన్యూ అధికారి మాత్రమే వచ్చారు. ఈ సచివాలయంలో 10 మంది ఉద్యోగులు ఉండగా.. మధ్యాహ్నానికి అప్పుడొకరు.. అప్పుడొకరు చొప్పున ఐదుగురు విధులకు హాజరయ్యారు. మిగిలిన వారంతా డుమ్మా కొట్టారు. ఇక్కడ రెవెన్యూ, డిజిటల్ అసిస్టెంట్‌కు మాత్రమే పనిభారం ఉంటోంది. మిగిలిన వారికి సరిపడా విధులు లేవు.
- చెన్నేకొత్తపల్లి సచివాయం-2 తలుపులు సోమవారం ఉదయం 10-30గంటలైన తెరుచుకోలేదు. ఆ తరువాత విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ సబీహా వచ్చి తలుపులు తెరిచారు. అనంతరం వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఒకరితరువాత ఒకరు ఆలస్యంగా విధులకు వచ్చారు. సమయపాలన పాటించడం లేదు.

జిల్లాలో మొత్తం 663 సచివాలయాలు ఉన్నాయి. అందులో 180 వార్డు, 483 గ్రామ సచివాలయాలు. వార్డు సచివాలయాల్లో 11 మంది చొప్పున, గ్రామీణ సచివాలయాల్లో 9 మంది చొప్పున సచివాలయ సెక్రటరీలు పనిచేస్తున్నారు. కొన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో పలు విభాగాల సెక్రటరీల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అత్యధిక సచివాలయాల్లో, మరీ ముఖ్యంగా వార్డు సచివాలయాల్లో అడ్మిన్, డిజిటల్ వీఆర్వో, హెల్త్ సెక్రటరీ, ఎనర్జీ సెక్రటరీ, ఎడ్యుకేషన్ సెక్రటరీ, శానిటేషన్ సెక్రటరీలకు మాత్రమే చేతినిండా పని ఉంటోంది. ఎమినిటీ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులకు ఆశించిన స్థాయిలో పనిలేదు. గ్రామ సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలకు మినహా మిగతా వారికి ఎలాంటి పనిభారం లేదు. ప్రభుత్వం చేపట్టిన రీ-గ్రూపింగ్ జిల్లాలో ప్రాసెస్‌లో ఉంది. వార్డు సచివాలయాల్లో రీ-గ్రూపింగ్ జరిగింది. గ్రామ సచివాలయాల్లో రీ-గ్రూపింగ్ ప్రాసెస్‌లో ఉంది. ఇప్పటి వరకూ రీ-గ్రూపింగ్ జరిగిన వార్డు సచివాలయాల్లో ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవు. అనంతపురంలో ఎనర్జీ అసిస్టెంట్ పోస్టుల్లో ఎవరున్నారో కూడా కొందరు సెక్రటరీలకు తెలియడం లేదు.


రాప్తాడు సచివాలయం-2లో ఒకే ఒక్కరు


రాంనగర్‌లోని 55వ సచివాలయంలో దెబ్బతిన్న భవనం గోడలు

- రుద్రంపేట-2, రాంనగర్ 54, 55 సచివాలయాలకు 10.30 గంటలైనా కొందరు విధులకు రాలేదు. ఫీల్డ్ సర్వేకి వెళ్లారని ఉన్నవారు అన్నారు. రుద్రంపేట 2 సచివాలయంలో పంచాయతీ సెక్రటరీ, ఏఎన్‌ఎం పోస్టులు రెండూ ప్రమోషనల్ వేకెన్సీలుగా ఉన్నాయి. 54, 55 సచివాలయాల్లో ఒక్కొక్క ఖాళీ ఉన్నాయి. ఈ రెండు సచివాలయాలు ఉన్న భవనం శిథిలావస్థలో ఉంది. కంప్యూటర్లు, ప్రింటర్లు రిపేరీలో ఉన్నాయి.
- అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని 40, 41వ వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం 11 గంటలైనా సచివాలయానికి చేరుకోలేదు. ఇద్దరు మాత్రమే సచివాలయానికి హాజరయ్యారు. మిగతా వారు ఎక్కడికెళ్లారని ఆరా తీస్తే... ఫీల్డ్‌లో ఉన్నారని సమాచారమిస్తున్నారు. చాలామందికి పనిలేకపోవడంతోనే హాజరు వేసి బయటికి వెళ్లిపోతున్నారు.


పనిచేస్తున్న ఉద్యోగులు, కొన్ని కుర్చీలు ఖాళీగా..

మంత్రి సీరియస్

ఎయిడ్స్ పరీక్షల కేంద్రం దగ్ధంపై

- నేడు జిల్లాకు రానున్న ఏపీ సాక్స్ జేడీ


కాలిపోయిన యంత్రాలు, పరికరాలు

అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలోని ఎయిడ్స్ పరీక్షల కేంద్రం కాలిపోవడాన్ని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సీరియస్‌గా పరిగణించారు. నిర్వహణ పట్టించుకోకపోతే ఎలాగని ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీ సాక్స్) ఉన్నతాధికారులపై బుధవారం సీరియస్ అయ్యారు. ఎయిడ్స్ పరీక్షల కేంద్రం దగ్ధంపై ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించడంతో మంత్రి ఆరాతీశారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆయన సీరియస్ అవడంతో ఏపీ శాక్స్ జేడీ డాక్టర్ కామేశ్వరరావు గురువారం జిల్లాకు రానున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించి త్వరతగతిన పునఃప్రాంభించేలా చర్యలు తీసుకోనున్నారు.

నెల్లూరుకు శాంపిళ్లు

వైద్యవిద్య కళాశాలలోని ఎయిడ్స్ పరీక్షల కేంద్రానికి అనంతపురంతోపాటు కర్నూలు, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రుల నుంచి శాంపిళ్లు వస్తాయి. వాటిని ఇక్కడే పరీక్షిస్తారు. పరీక్షల కేంద్రం కాలిపోవడంతో రాష్ట్ర వైద్యశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అనంతపురం శాంపిళ్లను నెల్లూరుకు, కర్నూలు వాటిని కడపకు, బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రి నుంచి గుంటూరుకు పంపించే పరీక్షించేలా ఆదేశించింది. దీంతో అంతరాయం ఏర్పడకుండా పరీక్షలు సజావుగా సాగనున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పదిరోజుల్లో పునఃప్రారంభం

దగ్ధమైన ఎయిడ్స్ పరీక్షల కేంద్రాన్ని మరమ్మతులు పూర్తిచేసి పదిరోజుల్లో తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ఏపీసాక్స్ అధికారులను రాష్ట్ర వైద్య శాఖ ఆదేశించింది. ఏపీఎంఎస్ఐడీసీకి అప్పగిస్తే నెలల తరబడి కొనసాగే అవకాశం ఉందని భావించిన అధికారులు.. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించనున్నారు. ఆ మేరకు చర్యలు చేపడుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. సాధారణ పరీక్షలు యథావిధిగా కొనసాగుతున్నట్లు వివరించాయి.

బంగారం ఇవ్వకుంటే చస్తాం..!

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద బాధితుల ఆందోళన


నగరంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

అనంతపురం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాము తనఖా పెట్టిన బంగారాన్ని వెంటనే ఇవ్వాలని, లేదంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు బాధితులు హెచ్చరించారు. నగరంలోని రాంనగర్ బ్రాంచి వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. పెట్రోల్ బాటిళ్లను తీసుకుని వచ్చి బ్యాంకు వద్ద బైఠాయించారు. పోలీసులు అప్రమత్తమైన బాధితులను అడ్డుకున్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఖాతాదారులు తనఖా పెట్టిన సుమారు రెండు కేజీల బంగారం ఆభరణాలు మాయమయ్యాయి. ఈ బ్రాంచిలో పనిచేసి వెళ్లిపోయిన కొందరు ఉద్యోగులు తనఖా బంగారాన్ని కాజేశారు. నగరంలోని కీర్తన ఫైనాన్స్‌లో తనఖా పెట్టి, నగదు కాజేశారు. మూడు నెలల క్రితం ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో బాధితులు అప్పట్లో బ్యాంకును ముట్టడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో నడుస్తోంది. నెలలు గడుస్తున్నా తమ బంగారాన్ని ఇవ్వకపోవడంతో తరచూ బాధితులు వచ్చి బ్యాంకు వద్ద ఆందోళన చేస్తున్నారు. సుమారు 30 మంది బాధితులు బుధవారం ఉదయం బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉద్యోగులను బ్యాంక్‌లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. తమకు న్యాయం చేసి లోపలికి వెళ్లాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న నాలుగో పట్టణ సీఐ జగదీష్, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సర్దిచెప్పినా బాధితులు వెనక్కు తగ్గలేదు. దీంతో బాధితులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇంతలో ఓ మహిళ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను మీద పోసుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు గుర్తించి వెంటనే పెట్రోల్ బాటిల్‌ను లాగేశారు. కోర్టులో కేసు నడుస్తోందని, త్వరగా న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో బాధితులు వెనుదిరిగారు.

అర్హులందరికీ ఇళ్లు

ఇదే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్


గృహ యజమానులకు తాళాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్

గుత్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద కు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయం అని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాన్ని పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డు ఎన్టీఆర్ నగర్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి కలెక్టర్ మూడు నూతన గృహాలను ప్రారంభించారు. అనంతరం గృహ యజమానులకు ప్రభుత్వం తరఫున మిఠాయిలు అందజేశారు. తర్వాత ఇంటి ఎదుట మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పక్కా గృహానికి రూ.1.8లక్షల మేర మాత్రమే నిధులు ఇచ్చేవారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రూ. 2.5లక్షలు ఇస్తోందన్నారు. గతంలో ఆగిపోయిన గృహ నిర్మాణాలకు అదనంగా నిధులు కేటాయించి, లబ్ధిదారులు వాటిని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గృహాల కోసం అర్హులైవారు ఈనెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తర్వాత పట్టణంలోని అనంతపురం రోడ్డులో రూ.20లక్షల అంచనా వ్యయంతో తాగునీటి పైపులైన్ పనులను ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాస్, మార్కెట్‌యార్డు చైర్మన్ సూర్యప్రతాప్, గృహనిర్మాణ శాఖ జిల్లా పీడీ శైలజ, డీఎల్‌డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఏఈ సూర్యనారాయణ, టీడీపీ నాయకులు చికెన్ శ్రీనివాసులు, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఇంట్లోనే ఉండండి..!

- మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి హౌస్ అరెస్టు
- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ
- తాడిపత్రిలో కాసేపు ఉత్కంఠ.. ఉద్రిక్తత


అభివృద్ధి పనులకు భూమిపూజ చేసేందుకు వెళుతున్న ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి

తాడిపత్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం కాసేపు టెన్షన్ వాతావరణం ఏర్పడింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి సమీపంలో రూ.11కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి భూమిపూజ చేశారు. ఈ క్రమంలో అక్కడికి భారీ ఎత్తున టీడీపీ వర్గీయులు చేరుకున్నారు. అదే సమయంలో మెడికల్ కాలేజీలలో పీపీపీ పద్ధతిని వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన ఆందోళనలో పాల్గొనేందుకు పెద్దారెడ్డి సిద్ధమయ్యారు. తన ఇంటి నుంచి యాడికి పట్టణానికి అనుచరగణంలో వెళ్లాలని భావించారు. ఒకేచోట ఇరువర్గాలు ఎదురుపడితే శాంతి భద్రతలకు ముప్పు ఏర్పడుతుందని పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్దారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. కాగా, నిరసన తెలపడానికి యాడికి మండల కేంద్రానికి ఉదయాన్నే వెళ్లాలని పోలీసులు సూచించారు. కానీ ఆలస్యం కావడంతో పోలీసులు అభ్యంతరం తెలిపారు. దీంతో పెద్దారెడ్డి ఇంటికి పరిమితం కాగా, ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రభుత్వ అభివృద్ధి పనులను ప్రారంభించి వెళ్లిపోయారు.

పోలీసులతో పెద్దారెడ్డి వాగ్వాదం

పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న తనను అడ్డుకోవడం ఏమిటని పెద్దారెడ్డి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హౌస్ అరెస్టు చేస్తున్నామని చెప్పిన టౌన్ సీఐ ఆరోహణరావు, రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డితో వాగ్వాదానికి దిగారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, కార్యక్రమానికి వెళ్లడానికి వీలులేదని పోలీసులు స్పష్టం చేయడంతో ఆయన ఇంటికి పరిమితమయ్యారు. పెద్దారెడ్డి తీరుపై ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. ప్రైవేటీకరణ జరుగుతోందంటే అభివృద్ధి జరుగుతోందని అర్థమని అన్నారు. మెడికల్ కాలేజీల విషయంలో వైసీపీ కోటి సంతకాల సేకరణ చేపట్టాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. 1980లోనే మనదేశం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిదని, దీనికి కారణం ప్రైవేటీకరణ అని అన్నారు. ప్రైవేటీకరణ వల్ల ఏం నష్టం ఉంటుందని ఆయన ప్రశ్నించారు. తమ ప్రభుత్వం అభివృద్ధిలో ముందుకు వెళుతుంటే వైసీపీ నాయకులు ఫ్యాక్షన్‌లో ముందుకు పోతున్నారని విమర్శించారు. ఫ్యాక్షన్ చేసేకాలం ఎప్పుడో పోయిందని, ప్రస్తుతం అయ్యా, అప్ప, నాన్న అని పిలుస్తున్నా పలకడం కష్టంగా ఉందని అన్నారు. తాడిపత్రి పట్టణంలో డ్రైనేజీ పనులకు రూ.11 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే డ్రైనేజీ సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. డ్రైనేజీ కాలువలను శుభ్రపరిచేందుకు రూ.90 లక్షల విలువగల అత్యాధునిక వాహనాలను తెప్పించామని అన్నారు.


పోలీసులతో వాగ్వాదానికి దిగిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఇంట్లోవాళ్లకు కోటి..!

- పశుసంవర్ధక శాఖలో నిధుల స్వాహా..!
- కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించిన మునుపటి జేడీ
- వెలుగుచూసిన అక్రమం
- నేడో.. రేపో.. రాష్ట్ర ఆడిట్ బృందం రాక

7

పనిచేసిన కంపెనీలకే కన్నం

కాపర్ వైరు అపహరణ కేసుల ఛేదింపు 7

హామీలు విస్మరించడం అన్యాయం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య
- అనంతలో ముగిసిన ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర

గుత్తికోట అభివృద్ధికి కృషి: కలెక్టర్


మన్రో సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్

గుత్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చారిత్ర కలిగిన గుత్తి కోట అభివృద్ధికి కృషి చేస్తామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. గుత్తి కోట కింద భాగంలో ఉన్న ఆంగ్లేయుల సమాధులను బుధవారం ఆయన పరిశీలించారు. బ్రిటిష్ పాలనలో దత్త మండలాల కలెక్టర్‌గా పని చేసిన సర్ థామస్ మన్రో సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం గుత్తి కోట చరిత్ర గురించి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ్ భాస్కర్‌ను అడిగి తెలుసుకున్నారు. కోటపైకి రోడ్డు మార్గానికి సంబంధించిన మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. కోటపైన పురాతన కట్టడాలు తొలగించకుండా రోడ్డు నిర్మాణాలు చేపట్టేలా పురవస్తు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నివేదికలు తయారు చేసి పంపాలని ఆదేశించారు. త్వరలోనే గుత్తికోటను సందర్శిస్తానన్నారు. కోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు నివేదిక సమర్పించాలని పురావస్తు శాఖ అధికారులను ఆదేశించారు. అంతకుముందు వన్నెదొడ్డి గ్రామ శివారులో ఉద్యానవనానికి సంబంధించి పూల మొక్కలు, చెట్లను పరిశీలించారు. ఊబిచెర్ల గ్రామ శివారులో సోలార్ భూములను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుణ్యవతి, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా, పురావస్తు శాఖ సిబ్బంది, సూర్యనారాయణ రెడ్డి, బాబాసాహెబ్, హెచ్ఎం జిలాన్, వీఆర్వో సురేంద్ర పాల్గొన్నారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032.
నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్2),భవనం సంఖ్య 02,బెరం క్యూ పార్క్, జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710.

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

వేలం తేది. 21-11-2025 చిరునామా: శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, D.NO.13/16&17, SRI VISHNUPRIYA COMPLEX,SUBHASH ROAD,NEAR TOWER CLOK, ANANTHAPURAMU-515001

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
GNTKLPJ2505030003	MEENUGALA KALAVATHI	RAYD1PJ2505140013	NAYAKULA BALAKRISHNA
KLNDGPJ2505090003	TALARI PRAKASH	RAYD1PJ2505150014	NADIMINTI VENKATESULU
KLNDGPJ2502170009	MOHAMMED RIZWAN ALI	RAYD1PJ2505150009	KODIPALLI LINGANNA
RAYD1PJ2505020012	VADDE THIMMAPPA	RAYD1PJ2505150021	EESWARA
RAYD1PJ2505030020	KAMASAMUDRAM BALAKRISHNA	RAYD1PJ2505190012	V NAGANNA
RAYD1PJ2505030016	KAMASAMUDRAM BALAKRISHNA	RAYD1PJ2505190011	VADDE KOLLAKKA
		RAYD1PJ2505230010	BOYA NAGARAJU
RAYD1PJ2505050024	GOLLA VENKATESHULU	RAYD1PJ2503010012	VADDE HANUMANNA
RAYD1PJ2505060017	GOLLA THIPPESWAMY	RAYD1PJ2505310017	K THIPPESHI
RAYD1PJ2505100005	VADDE MARENNA	URVKDPJ2502190009	BOYA LAKSHMI
RAYD1PJ2505120004	YALLAPPAGAARI LAKSHMI	URVKDPJ2503010029	SREENIVASULU

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవడటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ N CHENGAL REDDYను సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కానీ యెడల మరుసటిరోజు అదే నియమ నిబంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబంధించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిసాయి.

తేది: 13.11.2025
స్థలం : అనంతపురం

సం/- అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

చెరువుకు నీరు.. కరువు తీర్చేలా పైరు


నిండిన కరుట్లపల్లి చెరువు

చెరువు నిండుగా నీరు ఉండటంతో ఆయకట్టు భూములు పసిడి పంటలతో కళకళలాడుతున్నాయి. మండలంలోని కరుట్లపల్లి గ్రామ చెరువును హంద్రీనీవా నీటితో నింపారు. దీంతో ఆ చెరువు ఆయకట్టు కింద ఉన్న దాదాపు 500 ఎకరాలు సాగులోకి వచ్చింది. ఆ భూముల్లో వరి సాగు చేయగా ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి కరుట్లపల్లి చెరువుకు నీటిని మళ్లించారు. అప్పటి నుంచి చెరువు కింద ఆయకట్టు సాగుతోపాటు భూగర్భ జలాలు పెరిగి ఇతర బీడు భూములు కూడా సాగు లోకి వచ్చాయి. ఈ ఏడాది చెరువు పూర్తిగా నిండటంతో దిగువనున్న సింగంపల్లి చెరువు కూడా సరఫరా చేశారు. సక్రమంగా నీరుంటే భూమి కడుపున బంగారం పండిస్తామని పలువురు రైతులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, కూడేరు


కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

ఆకలితీర్చిన అమృతమూర్తి !



- సత్యసాయి జయంతి వేడుకల్లో లక్షలాది మందికి అన్నదానం
- శత జయంత్యుత్సవాలకు భారీగా తరలిరానున్న భక్తులు
- పెద్దఎత్తున నారాయణ సేవకు చర్యలు

పుట్టపర్తి/ధర్మవరం నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా.. ప్రజల సేవకు ఎంతో ప్రాధాన్యమిచ్చేవారు. అందులో భాగంగానే నారాయణ సేవకు శ్రీకారం చుట్టారు. సత్యసాయి పుట్టిన రోజు వేడుకల్లో నారాయణ సేవలో భాగంగా లక్షల మందికి అన్నదానం చేస్తారు. సత్యసాయి శివైక్యం తర్వాత కూడా నారాయణ సేవ కొనసాగిస్తున్నారు. ఈసారి శత జయంత్యుత్సవాలకు దేశవిదేశాల నుంచి భక్తులు తరలిరానున్నారు. అందుకు అనుగుణంగా నారాయణ సేవ చేసేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా.. ఏటా నవంబరులో పుట్టపర్తిలో ఈ సేవ ప్రత్యేకం. అలాంటి నారాయణ సేవకు ఎలా బీజం పడిందో తెలుసుకుందాం.

1960లో ప్రారంభం

సత్యసాయి బాబా ప్రేమతో, భక్తితో జనులకు అవసరమైన సేవలను అందిస్తుంటారు. 1960లో నారాయణ సేవ పేరిట అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నాటి నుంచి ఏటా భక్తులకు నారాయణ సేవ అందిస్తున్నారు. సేవా సంస్థలు.. సత్యసాయి భక్తులు తమతమ ప్రాంతాల్లో నారాయణ సేవలను కొనసాగిస్తున్నారు. ఏటా ప్రశాంతి నిలయంలో లక్షల మందికి నారాయణ సేవ (అన్నదానం) చేస్తున్నారు. సత్యసాయి జన్మదిన వేడుకల సందర్భంగా నవంబరులో వారం రోజులపాటు లక్షల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించేవారు. సత్యసాయి శివైక్యం తర్వాత ఏటా నవంబరులో జయంతి వేడుకల్లో లక్షలాది మంది భక్తులకు వస్త్రదానం, నారాయణసేవ అందిస్తున్నారు.


నారాయణసేవకు ఏర్పాటు చేసిన షెడ్లలో సౌకర్యాలు

శతజయంతి ఉత్సవాలకు దాదాపు పది లక్షల మంది భక్తులు రావచ్చని అంచనా. వారందరికీ నారాయణ సేవ అందించడానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అన్నదాన సేవలో ప్రపంచ వ్యాప్తంగా కోటికిపైగా సభ్యులు ఉన్నారు. వీరందరూ నారాయణ సేవ పేరిట అన్నదాన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తుంటారు. సత్యసాయి జయంతి వేడుకలు, ఆరాధనోత్సవాలు, పండుగలు, గురుపౌర్ణమి సందర్భంగా సత్యసాయి మందిరం, బస్టాండు, రైల్వేస్టేషన్, ఆస్పత్రులు, దేవాలయాల్లో నారాయణ సేవ చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోనే సేవాసంస్థలు తమ పరిధిలో పేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి. ముఖ్యమైన పండుగలు, వారివారి పుట్టిన రోజు సందర్భంగా సేవాసంస్థల సభ్యులు.. పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటారు. వరదలు, విపత్తుల సమయాల్లో సైతం ఆయా ప్రాంతాలకు వెళ్లి, బాధితులకు అన్నదానం చేస్తుంటారు. ఈ లెక్కన ఏటా కోటి మందికి పైగా పేదలకు అన్నదానం చేస్తుంటారు.

అమృత కలశం పేరిట సేవలు..

సత్యసాయి అమృత కలశం పేరిట భక్తులు సేవలందిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని సేవాసంస్థల సభ్యులు తమ పరిధిలో పేదలకు అవసరమైన సేవలు చేస్తున్నారు. ప్రతినెలా నిత్యావసర సరుకులు పంచుతుంటారు. ఏటా లక్షల కుటుంబాలకు అమృతకలశం పేరిట వీటిని అందజేస్తుంటారు. సత్యసాయి బోధనలే శిరోధార్యమని భక్తులు పేర్కొంటున్నారు.

12 షెడ్లలో నారాయణసేవ

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సులభంగా నారాయణసేవను అందించడానికి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేక సేవలు చేపట్టారు. బుధవారం సాయంత్రానికే భక్తుల కోసం 12 షెడ్లను ఏర్పాటు చేశారు. ఈ షెడ్ల ద్వారా గురువారం నుంచి నారాయణసేవ అందించనున్నారు. ఇందులో ప్రశాంతి మందిరంలో రెండు షెడ్లు, ప్రశాంతి మందరం పడమర గేటు వద్ద ఆరు షెడ్లు, విమానాశ్రయం వద్ద ఒక షెడ్డు, కర్నాటక నాగేపల్లి వద్ద ఒకటి, ఎనుములపల్లి గణేష్ సర్కిల్ వద్ద రెండు షెడ్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఉదయం మధ్యాహ్నం, సాయంత్రం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. లక్షల్లో భక్తులు హాజరవుతున్న నేపథ్యంలో వారు ఎలాంటి ఇబ్బంది పడకుండా అక్కడక్కడ ఈ షెడ్లను ఏర్పాటు చేసి నారాయణ సేవ అందించనున్నట్లు ట్రస్టు వర్గాలు తెలిపాయి.



ఆకలి తీర్చుతున్న దేవుడు సత్యసాయి: కేశప్ప, బుక్కపట్నం

సత్యసాయిబాబా శివైక్యం చెందినా ప్రజల గుండెల్లో కొలువై ఉన్నాడు. బాబా చేసిన సేవలు వేలకట్టలేనివి. ఆకలితో ఉన్న వాళ్లకు అన్నదాన సత్రాల ద్వారా ఆకలి తీర్చుతున్న దేవుడు. బాబా జయంతి ఉత్సవాలలోనే కాకుండా మిగతా సమయాల్లో కూడా నారాయణసేవ చేయడం సంతోకరం.

అన్నం పెట్టడం ఎంతో పుణ్యం

కరువుకు ప్రసిద్ధి చెందిన అనంతపురం జిల్లాలో ప్రజల దప్పిక తీర్చిన మహనాయుడు బాబా. ప్రతి ఏడాది సత్యసాయిబాబా జయంతి వేడుకలలో పదిరోజులపాటు పలువురు భక్తులు నారాయణసేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల ఆకలిని తీర్చుతున్నారు. మనిషికి కడుపునిండా అన్నం పెట్టడం ఎంతో పుణ్యం.

- వెంకటరెడ్డి, ఇండ్లవెంకటంపల్లి




సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సత్యసాయి విద్యార్థుల సైకిల్ ర్యాలీ

పుట్టపర్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి విద్యార్థుల సైకిల్ ర్యాలీని వైస్ చాన్సలర్ రాఘవేంద్ర ప్రసాద్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. తొలుత బెంగళూరులోని బృందావనం క్యాంపస్‌లో ఆయన మొక్కలు నాటారు. అనంతరం సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సైక్లింగ్ ఫర్ సాయి పేరిట విద్యార్థులు చేపట్టిన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ చిక్‌బళ్లాపూర్‌లోని నందగిరి మీదుగా గురువారం ప్రశాంతి నిలయానికి చేరుకుంటుంది. పర్యావరణ పరిరక్షణ కోసమే ఈ ర్యాలీని చేపట్టినట్లు కళాశాల సిబ్బంది పేర్కొన్నారు. గురువారం స్థానిక సాయి హిల్‌వ్యూ స్టేడియంలో సైకిల్ ర్యాలీ ముగుస్తుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శ్రీకాంత్ కన్నా, లెక్చరర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి సంగీత కార్యక్రమాలు


ప్రశాంతి నిలయం గణేష్ గేటు వద్ద బాబా చిత్రపటానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

పుట్టపర్తి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంత్ సభా మండపంలో గురువారం నుంచి 17వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మొదటిరోజు అనిల్‌బాన్‌రామ్ ఫ్లూట్ వాయిద్యం, హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 14న కుమారి రూప సితార్ వాయిద్యం, 15న విదేశీ భక్తుల సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు, 16న ఔజాద్ అలీ ఖాన్ బృందం వాయిద్యకచేరి, 17న పండిట్ విస్నాత మోహన్ బట్టు బృందం వీణ వాయిద్యం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

విధులను

పంచే స్తేనే మేలు..!

(5వ పేజీ తరువాయి)

ఉద్యోగుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపించింది. ఉదయం 10.30కు కొందరు.. 11 గంటల తరువాత కొందరు విధులకు వచ్చారు. మరికొందరు కార్యాలయం వైపు కన్నెత్తి చూడలేదు. పనిభారం ఉన్నవారు మాత్రమే కార్యాలయంలో గడిపారు. కొందరు ఇలా వచ్చి, అలా వెళ్లిపోయారు. 'క్షేత్రస్థాయి పని' పేరిట ఎక్కువ మంది విధులకు డుమ్మా కొడుతున్నట్లు స్పష్టంగా అర్థమైంది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'వన్ విజన్ వన్ డైరెక్షన్' అనే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాలను విజన్ యూనిట్‌గా మారుస్తోంది. జనాభా ప్రాతిపదికన రీ గ్రూపింగ్ చేస్తోంది. జనాభా 2500 మంది కంటే తక్కువ ఉండే సచివాలయాలలో ఆరుగురు, 2500 నుంచి 3500 మంది ఉంటే ఏడుగురు, 3500కు పైగా జనాభా ఉంటే ఎనిమిది మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటోంది.

ఆలస్యంగా విధులకు..

- నార్పల సచివాలయం-1లో ఉదయం 12 గంటలైనా ఒక వెటర్నరీ సచివాలయ ఉద్యోగి మాత్రమే హాజరయ్యారు. మిగతా ఉద్యోగులు ఎవరూ రాలేదు. 12 గంటల తరువాత ఒక్కొక్కరు తీరుబడిగా వచ్చి విధుల్లో నిమగ్నమయ్యారు.
- గార్లదిన్నె మండలంలో ఉదయం 11 గంటలైన సచివాయాలకు సిబ్బంది రారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్, డిజిటల్, వెల్ఫేర్, హార్టికల్చర్, సెరికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు పని ఒత్తి ఉంది. వీఆర్వోలు, సర్వేయర్లు క్యాంపుల పేరుతో సచివాలయాలకు అడపాదడపా వస్తున్నారు. మహిళా పోలీసులకు ఏ మాత్రం పని లేదని చెబుతున్నారు.
- బుక్కరాయసముద్రం సచివాలయం -1లో ఉదయం 11 గంటలకు మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే కనిపించారు. మిగిలిన సిబ్బందిలో ఒకరికి రోడ్డు ప్రమాదం జరిగిందని, డిజిటల్ అసిస్టెంట్ మరో కారణంతో సెలవులో ఉన్నారు. వీఆర్వో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా మిగిలిన సిబ్బంది ఎక్కడికి వెళ్లారో తెలియదు.
- అనంతపురంరూరల్ మండలంలోని ఉప్పరపల్లి, ఇటుకలపల్లి గ్రామ సచివాలయాల్లో పది మంది చొప్పున ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎక్కువ పని ఉంది. వీరి తరువాత ఏఎన్ఎం, గ్రామ సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు ఓ మోస్తరు పని ఉంటోంది. మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పశువైద్య సిబ్బంది అడపాదడపా తప్పా మిగిలిన సమయాల్లో ఖాళీగా ఉంటున్నారు.
- అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని నవోదయకాలనీలో ఉన్న 40వ సచివాలయంలో 9 పోస్టులు ఉండగా...ఇద్దరు మాత్రమే విధులకు హాజరయ్యారు. మరో ఏడుగురు విధులకు ఆలస్యంగా వస్తారని అక్కడ ఉన్న వారు చెప్పారు. పక్కనే ఉన్న 41వ సచివాలయంలో 9మందిలో ఆరుగురు విధులకు హాజరయ్యారు. తమకు స్పష్టమైన జాబ్‌చార్ట్, అధికారి పర్యవేక్షణ బాధ్యత కేటాయిస్తే సక్రమంగా సమయపాలనతో విధులు నిర్వహిస్తామని సచివాలయ ఉద్యోగులు చెప్పుకొస్తున్నారు.
- కూడేరు మండలం తిమ్మాపురం గ్రామ సచివాలయంలో ఉదయం 10.30 గంటల్లోపు గ్రామ కార్యదర్శి, ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, వెటర్నరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లు మాత్రమే హాజరయ్యారు. 11 గంటలైనా ఇంజనీరింగ్ అసిస్టెంట్ హాజరుకాలేదు. మిగిలినవారు ఫీల్డ్‌కు వెళ్లినట్లు తెలిపారు.
- యాడికి మండలంలో సచివాలయాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శి మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగతా వారు ఫీల్డ్‌కు వెళ్లినట్లు చెబుతున్నారు. వీరిలో సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు మాత్రమే విధులు ఎక్కువగా ఉంటున్నాయి. వీఆర్వోలు, సర్వేయర్లు ఫీల్డ్ వర్క్ పేరుతో ఎప్పుడు కార్యాలయంలో ఉండరని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- పెద్దవడుగూరులోని సచివాలయంలో రెండు పోస్టులు ఖాళీగా ఉండగా ఇద్దరు సెలవుపై వెళ్లారు. ముగ్గురు మాత్రమే విధులకు హాజరయ్యారు.
- పెద్దపప్పూరు మండలంలోని సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లకే ఎక్కువగా పనులు ఉన్నాయి. మహిళా పోలీసులకు పని భారం లేదు.
- యల్లనూరులోని సచివాలయంలో ఉదయం 10 గంటలకు డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వోలు మాత్రమే ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, ఏఎన్ఎం, విద్యుత్‌లైన్‌మెన్, అగ్రికల్చర్ అసిస్టెంట్ కార్యాలయాలకు రాలేదు.

సర్వేలతో సతమతం

- సచివాలయ ఉద్యోగులకు సర్వే తలపోటు తెప్పిస్తోంది. జియోట్యాగ్, ఈ-కేవైసీ, మిస్సింగ్ చైల్డ్, వాట్సప్ డోర్ టు డోర్, పీ-4, వర్క్‌ఫ్రం హోం, ఆధార్ సీడింగ్, కౌశలం, ఆర్‌సీహెచ్, యూ-విన్, ఏఎంటీ, ఎన్‌సీడీసీడీ, ఎన్‌ఎంఈపీ ఇమ్యూనైజేషన్ ఇలా 19 నుంచి 42 వరకూ సర్వేలు చేయాల్సి వస్తోంది. వీటి కోసం ఇంటింటికి తిరుగుతున్నారు. ఓటీపీలు తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తలకు మించిన భారంగా మారింది. రెగ్యులర్ విధులకు అదనంగా సర్వే పనులు చేయాల్సి వస్తోంది.
- రీ గ్రూపింగ్‌తో సచివాలయ ఉద్యోగులను మల్టీపర్పస్, టెక్నికల్ విభాగాలు వేరు చేశారు. మల్టీపర్పస్ కింద అడ్మిన్, వెల్ఫేర్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ సెక్రటరీ, మహిళా పోలీస్, వీఆర్ఓలు కార్యాలయంలోనే ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాలి. టెక్నికల్ క్యాటగిరీ కింద శానిటేషన్ సెక్రటరీ, ప్లానింగ్ సెక్రటరీ, ఎమినిటీస్ సెక్రటరీ, ఏఎన్ఎం, ఎనర్జీ అసిస్టెంట్‌లను చేర్చారు. వీరు క్షేత్రస్థాయి విధులకు వెళ్లాలి. విజన్ యూనిట్ అమలుతో ప్రయోజనం ఉంటుందని సచివాలయ ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

పాడైపోయిన కంప్యూటర్లు

చాలా సచివాలయాలలో కంప్యూటర్లు, ప్రింటర్లు చెడిపోయాయి. వాటి మరమ్మతులకు సాంకేతిక సాయం కూడా అందడం లేదు. స్టేషనరీ కూడా సకాలంలో అందడం లేదు. వార్డు సచివాలయాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రికార్డుల కోసం కొందరు సచివాలయ ఉద్యోగులు చేతి నుంచి రూ.1500 వరకూ ఖర్చు చేయాల్సి వస్తోంది. పౌరసేవలు బాగానే అందుదున్నాయని నగర ప్రజలు అంటున్నారు.


శింగనమల సచివాలయంలో ఉదయం 10.30 సమయంలో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

పది పరీక్షల ఫీజు చెల్లించండి

అనంతపురం విద్య, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పదో తరగతి 2025-26 విద్యా సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపునకు సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, పరీక్షల విభాగాధిపతి (ఏసీ) వెంకటేశులు బుధవారం తెలిపారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 23వ తేదీ వరకు రెగ్యులర్, ఓపెన్ టెన్త్, ఒకేషనల్ రెగ్యులర్ అభ్యర్థులు, పరీక్ష తప్పిన వారు ఫీజులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలన్నారు. ఫెయిలైన వారు 3కంటే ఎక్కువ సబ్జెక్టులు ఉంటే రూ.125, అంతకన్నా తక్కువ ఉంటే రూ.110, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ ఫీజుతో పాటు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.50 అపరాధ రుసుంతో డిసెంబరు 3 వరకు, రూ.200తో 10 వరకు, రూ.500తో 15వ తేదీ వరకు రెగ్యులర్ ఫీజుతో కలిసి చెల్లించాల్సి ఉంటుందన్నారు. యూడైస్ పోర్టల్‌లో విద్యార్థి వివరాలు ధృవీకరించిన తర్వాత వెబ్‌సైట్‌లోని పాఠశాల లాగిన్ ద్వారా అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష రుసుం చెల్లించాల్సి ఉంటుందని ప్రధానోపాధ్యాయులకు డీఈఓ, ఏసీ తెలిపారు.

యువతలో సామాజిక బాధ్యత పెరగాలి

- ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
- అట్టహాసంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు


యువజనోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ


యువతుల కోలాటం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి యువజనోత్సవాలు స్థానిక ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ జ్యోతి వెలిగించి, యువజనోత్సవాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. యువత నిర్దిష్టమైన లక్ష్యాలను ఎంచుకుని.. సాధన చేయాలన్నారు. జానపద నృత్యంలో అజయ్‌కుమార్, జానపద గేయంలో సాయిపల్లవి, డిక్లమేషన్‌లో దీపశ్రీ, చిత్రలేఖనంలో సాయిప్రమీద, కవితల పోటీలో వెంకటసాయి, కథల పోటీలో తేజస్విని, సైన్సు మేళాలో అభిషేక్ విజేతలుగా నిలిచారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి రవిశంకర్ రెడ్డి తెలిపారు. అనంతరం విజేతలకు మొమెంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ సహదేవుడు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రణతి, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, జయమారుతి పాల్గొన్నారు.

క్రాంతి పథం !


ప్రపంచ కప్ నెగ్గిన భారత మహిళా క్రికెట్ జట్టుతో క్రాంతి

భారత మహిళా క్రికెట్ జట్టు ట్రైనింగ్ అసిస్టెంట్‌గా గుంతకల్లు యువకుడు

వరల్డ్‌కప్ గెలవడంలో ఇతోధిక పాత్ర

బీసీసీఐలో అంచెలంచెలుగా ఎదుగుతున్న క్రాంతికుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు విశ్వవిజేతగా అవతరించడంలో అనంతపురం జిల్లా యువకుడి పాత్ర చెప్పుకోదగ్గ స్థాయిలో ఉంది. గుంతకల్లుకు చెందిన క్రాంతికుమార్ భారత మహిళా క్రికెట్ జట్టుకు ట్రైనింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. గుంతకల్లు రైల్వే విశ్రాంత ఉద్యోగి జి. వెంకటరమణ, జయమ్మ దంపతుల కుమారుడు క్రాంతికుమార్ 11 ఏళ్ల కిందట క్రికెట్‌ను ప్రొఫెషన్‌గా ఎంచుకుని అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. క్రాంతికుమార్ 2010లో గుంతకల్లు రైల్వే హైస్కూల్‌లో పదోతరగతి పూర్తి చేశాడు. 2014లో గుత్తి గేట్స్ కాలేజీ బీటెక్‌లో ఈసీఈ చదివాడు. తర్వాత కొన్నాళ్లు ఆర్డీటీలో క్రికెట్‌లో శిక్షణ పొందాడు. 2015లో క్రికెట్‌ను ప్రొఫెషన్‌గా తీసుకుని ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ బీసీసీఐలో చేరాడు. మొదటి భారత మహిళా క్రికెట్ జట్టుకు అసిస్టెంట్‌గా చేరాడు. ఆ తరువాత ట్రైనింగ్ అసిస్టెంట్, ఫిట్‌నెస్, ఫిజియో థెరపిస్టుగా పనిచేశాడు.

ఐపీఎల్‌లో సైతం

గత ఐదేళ్ల నుంచి భారత మహిళా జట్టుకు సంబంధించి స్టాఫ్ మెంబర్‌గా క్రాంతికుమార్ సేవలందిస్తున్నాడు. 2022లో ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ జట్టుకు సపోర్ట్ స్టాఫ్ మెంబర్‌గా పనిచేశాడు. మూడేళ్ల కిందట జరిగిన ఆసియా గేమ్స్, 2022లో జరిగిన కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత జట్టుకు సపోర్ట్ స్టాఫ్ సభ్యుడిగా పని చేశాడు. 2025 మహిళా వరల్డ్‌కప్ విజేత జట్టులో సభ్యుడిగా క్రాంతికుమార్ ఉండడం విశేషం.

ఈ స్థాయిని ఊహించలేదు

క్రికెట్ అంటే చిన్నప్పటి నుంచి పిచ్చి. అదే నన్ను ఈ స్థాయికి చేర్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడవడంతో నా క్రికెట్ ప్రయాణం సాఫీగానే సాగింది. తొలుత ఫ్యాషన్‌గానే క్రికెట్‌ను ఎంచుకున్నా తరువాత ఎలాగైనా సరే మంచి స్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లా. 11ఏళ్లుగా క్రికెట్‌ను ప్రొఫెషన్‌గా ఎంచుకుని సాగుతున్నా. ఇటీవల ముగిసిన మహిళా వరల్డ్‌కప్‌లో లీగ్ మ్యాచ్ నుంచి ఫైనల్ వరకు...ప్రతి మ్యాచ్‌ని ఫైనల్‌గా భావించాం. కప్ సాధిస్తామనే విశ్వాసం జట్టులోని ప్రతి ఒక్కరికి ఉంది. అదే భారత జట్టును విశ్వవిజేతగా నిలిపింది.

-క్రాంతికుమార్, భారత మహిళా క్రికెట్ జట్టు ట్రైనింగ్ అసిస్టెంట్


భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో క్రాంతికుమార్

అప్పుల ఉరికి కూలీ బలి

ధర్మవరం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయినగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్(28) అప్పులబాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు... ప్రవీణ్‌కుమార్ కూలి పనులు చేసుకుంటూ భార్య కుమారుడిని పోషించుకునేవాడు. కుటుంబ పోషణ కోసం బయట వ్యక్తులతో అప్పులు చేశాడు. అయితే తగినంత ఆదాయం లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలంటూ తరచూ మథనపడేవాడు. మృతుడి తండ్రి దేవరకొండ నారాయణస్వామి మాత్రం కష్టపడి పని చేసి అప్పులు తీరుద్దామని ధైర్యం చెప్పేవాడు. కాగా 9 నెలల గర్భవతి అయిన భార్యను, ఐదేళ్ల కుమారుడిని మంగళవారం ఆమె పుట్టినిల్లు అయిన అనంతపురంలో వదిలి ప్రవీణ్‌కుమార్ తిరిగి ధర్మవరం వచ్చాడు. పట్టణంలోని వేరే ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రవీణ్‌కుమార్ తండ్రి బుధవారం ఇంటికి వచ్చాడు. వాకిలి వద్ద నిలబడి ఎంత పిలిచినా ప్రవీణ్ కుమార్ పలకకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి ఇంటిలోకి వెళ్లాడు. అక్కడ ఉరికి వేలాడుతున్న కుమారుడిని చూసి బోరుమంటూ విలపించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

బంగారం నెక్లెస్ చోరీ

యాడికి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రయాణంలో 2.5తులాల బంగారం నెక్లెస్ చోరీ అయినట్లు నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి బుధవారం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 8న వెంకటలక్ష్మి 2.5తులాల బంగారు నెక్లెస్‌ను బ్యాగులో పెట్టుకొని అనంతపురం జిల్లా గుత్తి నుంచి బస్సులో రాయలచెరువుకు బయల్దేరారు. జక్కలచెరువు గ్రామ సమీపాన బ్యాగును పరిశీలించగా అది కత్తిరించినట్లు గుర్తించారు. అందులో పెట్టిన బంగారు నెక్లెస్ కూడా కనిపించలేదు. తొండపాడు వద్ద గుర్తుతెలియని మహిళలు బస్సులో నుంచి వేగంగా దిగి వెళ్లిపోయినట్లు తెలిపారు. వారిపై అనుమానం ఉన్నట్లు వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య గొంతు కోసిన భర్త

కళ్యాణదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లిలో బుధవారం కుటుంబ కలహాలతో భార్య గొంతు కోశాడు ఓ భర్త. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. బోరంపల్లికి చెందిన దంపతులు రత్నమ్మ, ఎర్రిస్వామి బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సమస్యలతో వాగ్వాదానికి దిగారు. ఎర్రిస్వామి ఆవేశానికి లోనై ఇంట్లో ఉన్న చాకు తీసుకుని రత్నమ్మపై దాడి చేశాడు. ఆమె గొంతు కోయడంతో కుప్పకూలిపోయింది. చుట్టుపక్కల వారు వచ్చి చూశారు. అప్పటికే రత్నమ్మ రక్తపుమడుగులో కొట్టుమిట్టాడుతోంది. 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఎర్రిస్వామి పరారయ్యాడు. రత్నమ్మ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. దీనిపై కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

కుమార్తె చనిపోయిన మూడు రోజులకే కన్నుమూత


గంగమ్మ (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కంబదూరులోని ఆర్డీటీ కాలనీకి చెందిన శతాధిక వృద్ధురాలు గంగమ్మ (102) బుధవారం మృతి చెందారు. చిన్న కుమారుడు గంగాధర వద్ద గంగమ్మ ఉండేవారు. వయోభారంతో కన్నుమూశారు. గంగమ్మ మృతదేహానికి స్వగ్రామంలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆమెకు ముగ్గురు కుమారులు నారాయణప్ప, నాగరాజు, గంగాధర, కుమార్తె నారాయణమ్మ ఉన్నారు. ఇదివరకే పెద్ద కుమారుడు మరణించారు. మూడు రోజుల క్రితం కుమార్తె కూడా కన్నుమూశారు. బుధవారం గంగమ్మ చనిపోవడం పట్ల కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

మరో 15 పీజీ సీట్లు

వైద్య కళాశాలలో సంబరాలు



ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్‌ను అభినందిస్తున్న విభాగాధిపతులు

అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలకు మరో 15 పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) సీట్లు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయశ్రీ తెలిపారు. పీడియాట్రిక్స్, గైనిక్, అనస్థీషియా విభాగాలకు నాలుగు చొప్పున, అడ్మినిస్ట్రేషన్‌కు మూడు సీట్లు మంజూరయ్యాయన్నారు. దీంతో మొత్తం సీట్ల సంఖ్య 136కి చేరిందన్నారు. బుధవారం విభాగాధిపతులు షంషాద్‌బేగం, రవికుమార్, నవీన్‌కుమార్, శౌరి, ఎన్ఎంసీ కమిటీ సభ్యులు ప్రవీణ్ డీన్, ప్రవీణ, శ్రావణి తదితరులు ప్రిన్సిపాల్ విజయశ్రీ, సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం, వైస్ ప్రిన్సిపాల్ షారోన్ సోనియాను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాగిఫలకపై విజయనగర శాసనాలు

● శ్రీకాళహస్తిలో లభ్యం


రాగి శాసనాలను చూపుతున్న సింగరాజు మణి


విజయనగరం కాలం నాటి రాజముద్ర

శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో విజయనగర కాలం నాటి రాగిఫలక శాసనాలు వెలుగుచూశాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అనువంశిక గురుకుల్‌గా సేవలందిస్తున్న డాక్టర్ పరశురామ్ ఇంట ఇవి తరాలుగా ఉన్నాయి. కార్తీక మాసం సందర్భంగా వీటిని బయటకు తీసి శుద్ధి చేస్తుండగా, వీరి కుటుంబ పురోహితుడు సింగరాజు మణి ఫోటోలు తీసి, వాటిని మైసూరులోని భారత పురావస్తు శాఖ శాసన విభాగం డైరెక్టర్ మునిరత్నం రెడ్డికి పంపారు. ఆయన పరిశీలించి ఇవి క్రీ.శ. 1576లో విజయనగరరాజు శ్రీరంగరాయ శ్రీకాళహస్తీశ్వరాలయంలో కైంకర్యాలు, అన్నదానాలు నిర్వహించడం కోసం కొన్ని గ్రామాలను దానంగా ఇచ్చిన శాసనాలని నిర్ధారించారు. సంస్కృత భాషలో నందినాగరి లిపిలో రాగి రేకుల మీద వీటిని చెక్కి ఉన్నారు. వీటిని స్వయంగా పరిశీలించడం కోసం మునిరత్నం రెడ్డి శ్రీకాళహస్తికి రానున్నారు. నాలుగు రాగి ఫలకలు వీరి వద్ద ఉన్నాయి.

జాతీయస్థాయి పోటీలకు సుస్మిత



కణేకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): విజయవాడలో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో మండలంలోని హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుస్మిత ప్రతిభచాటింది. త్వరలోనే రాజస్థాన్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు హెచ్‌ఎం వేణుగోపాల్, పీఈటీ సరిత బుధవారం తెలిపారు.

ఇంట్లోవాళ్లకు కోటి..!

పశుసంవర్ధక శాఖలో నిధుల స్వాహా..!

- కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించిన మునుపటి జేడీ
- వెలుగుచూసిన అక్రమం
- ప్రభుత్వ సొమ్మును భద్రంగా ఉంచాలనే మళ్లించినట్లు బుకాయింపు?
- రాష్ట్ర డైరెక్టర్ దృష్టికి వ్యవహారం
- నేడో.. రేపో.. రాష్ట్ర ఆడిట్ బృందం రాక

పశుసంవర్ధక శాఖలో గతంలో పనిచేసిన ఏకంగా రూ.కోటికిపైగా స్వాహా చేసినట్లు సమాచారం. అది కూడా కుటుంబికుల ఖాతాలకు జమ చేసినట్లు తెలుస్తోంది. వ్యవహారం ప్రస్తుతం బయటకు పొక్కడంతో ఆ అధికారి కట్టుకథ చెబుతున్నారట. అబ్బే.. తాను నిధులు కొట్టేసే ఉద్దేశంతో మళ్లించలేదనీ, ప్రభుత్వ ఖాతాలో ఉంటే భద్రత ఉండదనే.. కుటుంబికుల ఖాతాలకు జమ చేశానంటూ బుకాయిస్తున్నాడు. పాపం.. ప్రభుత్వ సొమ్ముపై ఎంత జాగ్రత్తో కదా..


సిబ్బందితో సమావేశమైన జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో భారీగా నిధుల స్వాహా జరిగింది. ఆది నుంచీ వివాదాస్పద అధికారిగా పేరొందిన గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీ నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు సమాచారం. వివిధ పథకాలకు సంబంధించిన డిపార్టుమెంట్ ఖాతాల్లోని సొమ్మును కొందరు సిబ్బందితో కుమ్మక్కై కాజేసినట్లు సమాచారం. ఇందులో ఎక్కువ మొత్తంలో జేడీస్థాయి అధికారి తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించినట్లు సమాచారం. నిధుల స్వాహా విషయాన్ని రహస్యంగా ఉంచేందుకు సంబంధిత అధికారులు ప్రయత్నించారు. విషయం బయటకు పొక్కిన నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్ బుధవారం తన చాంబర్‌లో కార్యాలయ అధికారులు, సిబ్బందితో అత్యవసరంగా సమావేశమయ్యారు. నిధుల స్వాహాపై కూడా చర్చించినట్లు సమాచారం.

రూ.కోటికిపైగా స్వాహా

జిల్లా పశుసంవర్ధక శాఖకు సంబంధించిన నిధులను పలు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ వస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు ఖాతాల్లో మిగిలిపోయినట్లు సమాచారం. ఈ సొమ్ముపై వచ్చే వడ్డీని పలు అత్యవసర పనులకు వాడుకునే వెసులుబాటు ఉంటుంది. గతంలో ఇక్కడ జేడీగా పని చేసిన ఓ అధికారి డిపార్టుమెంట్ ఖాతాలోని నిధులపై కన్నేసినట్లు సమాచారం. ఆయన ఉద్యోగ విరమణ సమీపిస్తున్న తరుణంలో డిపార్టుమెంట్ ఖాతాలోని సొమ్మును తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి రూ.కోటికిపైగా మళ్లించినట్లు సమాచారం. డిపార్టుమెంట్ ఖాతాలోని సొమ్మును వాడుకునే సమయంలో ఏ పనికి ఖర్చు చేస్తున్నారు...? తదితర వివరాలు నమోదు చేయాల్సి ఉంది. అవేమీ లేకుండానే భారీగా సొమ్మును ఆ అధికారి తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి జమచేసినట్లు తెలుస్తోంది. సదరు జేడీకి పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్, మరికొందరు సిబ్బంది సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డబ్బు కాజేసిన విషయం బయటపడే అవకాశం ఉందని గ్రహించిన సదరు సీనియర్ అసిస్టెంట్ సెలవుపై వెళ్లాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందన్న అంశం తేలాల్సి ఉంది.

కలకలం..

రూ.కోటికిపైగా నిధులు స్వాహా చేశారన్న సమాచారంతో పశుసంవర్ధక శాఖలో కలకలం రేగింది. ఎవరెవరి ఖాతాలకు సొమ్ము జమ చేశారు..? ఇందులో ఎవరెవరి ప్రమేయం ఉందన్న దానిపై అధికారులు ఆరాతీశారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ జేడీనే నిధులు స్వాహాకు పాల్పడ్డారని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. సొమ్ము స్వాహా విషయం బయటకు పొక్కిన సమాచారం జేడీకి అనుకూలురైన సిబ్బంది చేరవేసినట్లు తెలిసింది. దీంతో సంస్థ డబ్బు ఎవరైనా కాజేస్తారన్న ఉద్దేశంతోనే కుటుంబ సభ్యుల ఖాతాల్లో భద్రంగా ఉంచాననీ.. ఇందులో తన తప్పేముందని ఆ అధికారి బుకాయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేడో.. రేపో.. ఆడిట్ బృందం రాక

నిధుల స్వాహాపై బ్యాంకు వివరాలతో సహా ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌కు పశుసంవర్ధక శాఖ అధికారులు నివేదించినట్లు సమాచారం. కలెక్టర్ ఆనంద్ కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులతో నిధుల స్వాహాపై ఆరాతీశారట. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర ఆడిట్ బృందం జిల్లాకు రానున్నట్లు సమాచారం. నిధుల స్వాహాపై సమగ్ర విచారణ చేసి, రాష్ట్ర ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి నివేదికలు సమర్పించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఆ శాఖలో తీవ్ర చర్చ సాగుతోంది.

హామీలు విస్మరించడం అన్యాయం

విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

అనంతలో ముగిసిన ఏఐఎస్ఎఫ్ బస్సుయాత్ర



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య

అనంతపురం విద్య, నవంబరు12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక, విస్మరించడం అన్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మండిపడ్డారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై చేపట్టిన రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర ముగింపు సభ బుధవారం అనంతలో నిర్వహించారు. నగరంలోని కేఎస్ఆర్ బాలికల కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయిస్వామి ఆధ్వర్యంలో పెద్దఎత్తున సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యారంగ పరిరక్షణకు రాజీలేని పోరాటం సాగిస్తామని తెలిపారు. పాలకులు సంస్కరణల పేరుతో విద్యారంగాన్ని వ్యాపారంగా మారుస్తూ నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.6,400కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెడుతున్నాయన్నారు. దీంతో విద్యార్థులు మానసికంగా నలిగిపోతున్నారన్నాని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖా మంత్రి లోకేశ్‌కు పేదోళ్ల విద్యారంగ సమస్యలు తెలియవా అని ప్రశ్నించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ సరికాదన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ చేపట్టే ఉద్యమాలకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. విద్యా వ్యతిరేక విధానాలపై రాష్ట్రవ్యాప్త పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ నాయకులు జగదీష్, జాఫర్. ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పుట్టా లక్ష్మణ్ణ, రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, మల్లికార్జున, రాజారెడ్డి, అల్లీపీరా, ఏఐఎస్ఎఫ్ నాయకులు చలపతి, మస్తాన్, ఫణీంద్ర, నాగభూషణం, రవికుమార్, సాయి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసిన కంపెనీలకే కన్నం

కాపర్ వైరు అపహరణ కేసుల ఛేదింపు

నలుగురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న కాపర్ వైరును చూపుతున్న డీఎస్పీ

నంబులపూలకుంట, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని సోలార్ కంపెనీల్లో గతంలో పనిచేసిన వారే కాపర్ వైరు అపహరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. కాపర్ వైరు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. నలుగురిని అరెస్టు చేసి, రూ.32లక్షల విలువ చేసే కాపర్ వైరును స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా.. ఒకరు ఆస్పత్రిలో ఉన్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఆయన వెల్లడించారు. నంబులపూలకుంటకు చెందిన అలీ, బాబాఫకృద్దీన్, బాలాజీ, ఆవుల శివ, రవి, మండల కేంద్రం సమీపంలోని ఎన్ రెడ్డివారిపల్లికి చెందిన పెద్దముబారక్, చిన్నముబారక్ ముఠాగా ఏర్పడ్డారు. సోలార్ ప్లాంట్‌లో పలు సంస్థలకు చెందిన కాపర్ వైరును పలుమార్లు అపహరించారు. దానిని విక్రయించి, సొమ్ము చేసుకున్నారు. చోరీలపై ఆయా సంస్థల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు గత ఆరు నెలల్లోనే ఆరు కేసులు నమోదయ్యాయి. రూ.32లక్షల విలువైన 62వేల మీటర్ల కాపర్ వైరును అపహరించారు. ఈ చోరీలను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. సీఐ నాగేంద్ర, ఎస్ఐ వలీబాషా, కానిస్టేబుల్ నారాయణస్వామి బృందంగా ఏర్పడి కాపుకాశారు. ఐయానా సోలార్ కంపెనీ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద కాపర్ వైరును అపహరిస్తుండగా.. పెద్ద ముబారక్, చిన్న ముబారక్, అలీ, బాబా ఫకృద్దీన్‌ను పట్టుకున్నారు. బాలాజీ, ఆవుల శివ పరారీలో ఉండగా.. రవి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులంతా గతంలో సోలార్ కంపెనీల్లో గ్రాస్ కట్టింగ్ (గడ్డికోత), వెల్డర్, టెక్నీషియన్, వెల్డింగ్ పనులు చేసినవారేనన్నారు.

బిడ్డను చూడకుండానే..

తండ్రి కన్నుమూత

ఆస్పత్రిలో కుమార్తె జననం

చూసేందుకెళ్తూ రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం

బత్తలపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో బిడ్డ జన్మించిందని తెలియగానే ఆనందంగా చూడడానికి బయల్దేరిన తండ్రి మార్గమధ్యలోనే దుర్మరణం చెందాడు. బిడ్డను చూడకుండానే కన్నుమూశాడు. మండలకేంద్రంలోని వైజంక్షన్‌లో బుధవారం రాత్రి బైక్ బోల్తాపడి ధర్మవరానికి చెందిన దిలీప్‌కుమార్ (25) మరణించాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరంలోని శాంతినగర్‌కు చెందిన నాగేంద్ర కుమారుడు దిలీప్‌కుమార్ పట్టు చీరలకు సంబంధించి రేషం వ్యాపారం చేస్తుండేవాడు. ఇతడికి భార్య లాస్య, కుమార్తె ఉన్నారు. అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో లాస్య బుధవారం ప్రసవించింది. ఆడ శిశువుకు జన్మనిచ్చింది. బిడ్డను చూసేందుకు దిలీప్ కుమార్ ఆనందంగా బయల్దేరాడు. ధర్మవరం నుంచి బైక్‌పై బయల్దేరాడు. బత్తలపల్లి దాటగానే వైజంక్షన్ వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన దిలీప్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కుటుంబికులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని, బోరున విలపించారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్,నవంబరు12(ఆంధ్రజ్యోతి):అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 19టన్నుల చీనీకాయలు వచ్చినట్లు చెప్పారు.

టమోటా కిలో రూ.33

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.33తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.13తో, సరసరిగా రూ.23తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1800 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు


కోర్టు వద్ద ప్రకాశ్ నాయుడు, నటుడు రాజ్‌కుమార్‌కు స్థానిక నాయకుల సత్కారం

గుత్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా నమోదైన కేసు విషయంగా పట్టణ కోర్టుకు టీడీపీ నాయకులు బుధవారం హాజరయ్యారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 2009 ఏప్రిల్‌లో గుత్తి పట్టణంలో సినీ నటుడు రాజ్‌కుమార్, చంద్రదండు వ్యవస్థాపకుడు ప్రకాష్‌నాయుడు, టీడీపీ నాయకులు కృష్ణ, గాజుల ఆదెన్న ప్రచారం నిర్వహించారు. ఈక్రమంలో నిబంధనలు అతిక్రమించారని అప్పట్లో వారిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. దీంతో వారు కోర్టుకు హాజరయ్యారు. వారి వెంట ఏజీపీ ఫకృబాష, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, టీడీపీ నాయకులు, పాల్గొన్నారు.

వార్డెన్ల జేఏసీ ఏర్పాటు

అనంతపురం విద్య, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): సంక్షేమ శాఖల వార్డెన్ల సంఘాన్ని పదేళ్ల తరువాత పునరుద్ధరించారు. జిల్లా జేఏసీని ఏర్పాటు చేశారు. స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల వార్డెన్లు బుధవారం సమావేశమయ్యారు. తమ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు. జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామునాయక్, ప్రధానకార్యదర్శిగా మారుతీప్రసాద్, అసోషియేట్ ప్రెసిడెంట్‌గా మస్తాన్, ఉపాధ్యక్షులుగా రాజశేఖరనాయుడు, నాగమణి, రామాంజనేయరెడ్డి, బయపరెడ్డి, గురుప్రసాద్, అశ్వత్థ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖరబాబు, సంయుక్త కార్యదర్శులుగా సాహిజి, జగన్నాథ్, నాగరాజు, గోవిందరెడ్డి, ఈరన్న, ఆదినారాయణ, బాలు, సూర్యాంజనేయులును ఎన్నుకున్నారు.

వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఒకటి చొప్పున సోషల్ కౌన్సిలర్, మల్టీపర్పస్ స్టాఫ్/కుక్, రెండు సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్ మొత్తం నాలుగు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీచేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వివరాలకు https://ananthapuramu.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

యువతి అదృశ్యం

యాడికి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూర్మాజీపేట గ్రామానికి చెందిన ఓ యువతి ఈనెల 8 నుంచి కనిపించడం లేదు. బాధిత కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆ యువతి తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేతన కమిషన్‌ను నియమించాలి

రైల్వే గార్డుల డిమాండ్: డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా


డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైల్వే గార్డులు

గుంతకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 8వ వేతన కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల భారత రైల్వే గార్డుల కౌన్సిల్ (ఏఐజీసీ) నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే గార్డుల సమస్యలపై బుధవారం స్థానిక డీఆర్ఎం కార్యాలయం ఎదుట ఏఐజీసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సంఘం డివిజనల్ కార్యదర్శి పీకే సింగ్ మాట్లాడుతూ.. రైలు మేనేజర్లకు వేతన స్థాయిలను నిర్ధారించాలనీ, 2024 జనవరి 1వ తేదీ నుంచి రన్నింగ్ అలవెన్సును 25 శాతానికి పెంచాలనీ, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనీ, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైలు గార్డులు పాల్గొన్నారు.

జంబూద్వీప చక్రాన్ని పరిశీలించిన జేసీ


వివరాలు తెలుసుకుంటున్న జేసీ శివనారాయణశర్మ

వజ్రకరూరు(ఉరవకొండ), నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొనకొండ్ల సమీపంలో ఉన్న జంబూద్వీప చక్రాన్ని జేసీ శివనారాయణశర్మ బుధవారం పరిశీలించారు. కొనకొండ్ల వద్ద ఆర్కియాలజీకి సంబంధించి ప్రతిపాదించిన అదనపు భూమి కోసం కొండ వద్ద ఉన్న స్థలాన్ని పరిశీలించారు. పురావస్తు శాఖకు 25ఎకరాలు కేటాయించగా, రోడ్ల నిర్మాణం కోసం 2.6 ఎకరాల స్థలం అదనంగా అవసరమైంది. అందుకు సంబంధించిన రికార్డుల వివరాలను జేసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నరేష్, ఆర్కియాలజీ ఏడీ స్వామి నాయక్, వీఆర్వోలు, శత్రనాయక్, నవ్య పాల్గొన్నారు.



బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర॥7382114647

AJA- 257552

CHANGE OF NAME

I,P.R.Vijayalakshmi W/o P.Ravindra Prasad, Residing at 7-2-99A, Dhanalakshmi Road, Hindupur, Have Changed my name to Vijayalakshmi Ravindra Pachhipulusu for all Purposes in future and both are same person.

AJA -246862

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఎమ్మెల్యే ఇంట అయ్యప్ప పడిపూజ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు

అనంతపురం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మియాపూర్‌లోగల అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నివాసంలో బుధవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజను నిర్వహించారు. అరుణ్ గురుస్వామి నేతృత్వంలో ఈ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తర్వాత భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తాను మొదటి నుంచీ అయ్యప్పస్వామి భక్తుడినని తెలిపారు. ఇప్పటి వరకూ 25సార్లు మాలధారణ చేసినట్టు చెప్పారు. స్వామి కృపతో అనంతపురం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యత్వ రుసుము అందజేత

అనంతపురం టౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నవయుగ కాలనీకి చెందిన సీపీఐ సభ్యులు 200 మందికి సంబంధించిన పార్టీ సభ్యత్వ రుసుము రూ.40వేలను ఆ పార్టీ రాష్ట్ర నాయకులకు అందజేశారు. బుధవారం నవయుగ కాలనీ సెక్రటరీ రాజు సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నగర కార్యదర్శి శ్రీరాములును కలిసి రూ.40వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అల్లీపీరా, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు సంతోష్, నాయకులు జయకృష్ణ, జాఫర్, పవన్ కుమార్, శివ, రాజా, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో తోపుదుర్తి విద్యార్థినుల సత్తా



సత్తాచాటిన విద్యార్థినులతో హెచ్ఎం, టీచర్లు

అనంతపురంవిద్య, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటి జాతీయపోటీలకు ఎంపికయ్యారు. 8వతరగతి చదువుతున్న లిఖిత, బెస్సీ అండర్-19 విభాగం స్విమ్మింగ్ పోటీలో ప్రతిభ చాటి గోల్డ్‌మెడల్, వెండి పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఆ విద్యార్థినులను పాఠశాలలో బుధవారం హెచ్ఎం సాంబశివారెడ్డి, పీడీ శ్రీవాణి, టీచర్లు అభినందించారు.

ఎస్‌జీఎఫ్ చెస్‌పోటీల్లో బంగారు పతకాలు



హన్నీ స్టీఫెన్, క్లారాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అస్మాఖాన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ద్వారకానగర్‌లోని నారాయణ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈనెల 7, 8వ తేదీలలో పార్వతీపురం మన్యం జిల్లాలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు హన్నీ స్టీఫెన్, క్లారా బంగారు పతకాలు సాధించారు. ప్రిన్సిపాల్ అస్మాఖాన్, కోచ్ హుస్సేన్‌ఖాన్, పీడీ జగన్ బుధవారం ఆ విద్యార్థులను అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు లోకేష్



అనంతపురంక్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ జాతీయ పోటీలకు స్థానిక న్యూటౌన్ బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి లోకేష్ ఎంపికయ్యాడు. ఈనెల 7, 8వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 హైజంప్ పోటీల్లో ప్రతిభ చాటి వెండిపతకం సాధించాడు. అలాగే ఈనెలాఖరులో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యాడు. లోకేష్‌కు పాఠశాల హెచ్ఎం వీరన్న, పీడీ ప్రవీణ్, ఉపాధ్యాయులు బుధవారం అభినందనలు తెలిపారు.

పద్మశాలి భవన్‌కు స్థలం కేటాయించండి

అనంతపురం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పద్మశాలి భవన్ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని ఏపీ పద్మశాలి సంక్షేమం, అభివృద్ధి కార్పొరేష్ డైరెక్టర్ పోతుల నరసింహులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టర్ ఆనంద్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్యే పరామర్శ

బుక్కరాయసముద్రం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం కొర్రపాడు గ్రామానికి చెందిన పలువురు కూలీలు పనులకు ఆటోలో వెళ్తుండగా రెడ్డిపల్లి వద్ద లారీ ఢీ కొట్టడంతో 14 మంది గాయపడిన విషయం తెలిసిందే. వారిలో పరిస్థితి విషమంగా ఉన్న లక్ష్మన్న, వెంకటేశులు అనంతపురం నగరంలోని సవీరా అస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని ఎమ్మెల్యే బండారుశ్రావణిశ్రీతో పాటు టీడీపీ జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, పలువురు నాయకులు బుధవారం పరామర్శించారు. చికిత్సకు కావాల్సిన నగదును వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. అలాగే మిగిలిన 12 మంది కూలీలను అనంతపురం సర్వజన అస్పత్రిలో పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వ వైద్యాధికారులకు సూచించారు. గాయపడిన కూలీలను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి..

నియోజకవర్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, ఆర్టీఓ అధికారులు చొరవచూపాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అతివేగం వలన పలు రోడ్డు ప్రమాదాలు జరగుతున్నాయన్నారు. నిత్యం తనిఖీలు చేసి రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

మృతురాలి కుటుంబికులకు ఎంపీ పరామర్శ

గార్లదిన్నె, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇల్లూరులో టీడీపీ పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇల్లూరు రామాంజనేయులు తల్లి నారాయణమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి నారాయణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు సుంకన్న, వడ్డే వన్నూర్, నాగేంద్ర, గురుమూర్తి పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ
- అమ్మవారిపేటలో పక్కాగృహం ప్రారంభం



అమ్మవారిపేటలో పక్కాగృహం లబ్ధిదారులతో ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి వారి సొంతింటి కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ అన్నారు. మండలంలోని అమ్మవారిపేట గ్రామంలో కూటమి ప్రభుత్వంలో నిర్మించిన పక్కాగృహాన్ని బుధవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు సొంతింటి కల నేరవేర్చడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధ్యానత ఇస్తోందన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 6,048 మంది పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో 3800 మందికి ఇంటి పట్టాలు, స్థలాలున్నాయన్నారు. మిగిలిన వారికి ఇంటి స్థలాలు చూపించి పక్కాగృహాలు నిర్మిస్తామని అన్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రామూర్తి, ఎంపీపీ సునీత, టీడీపీ నాయకులు పొడరాళ్ల రవీంద్ర, నాగేష్, గంగులప్ప, సుధాకర్, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

పండుగలా గృహప్రవేశం

అనంతపురంరూరల్: మండలంలో బుధవారం చేపట్టిన గృహ ప్రవేశాల మహోత్సవం పండుగలా సాగింది. కందుకూరు గ్రామంలో లబ్ధిదారుడు ఓబులేసుకు చెందిన నూతన గృహాన్ని హౌసింగ్ అధికారులు, టీడీపీ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీమన్నారాయణ, స్పెషలాఫీసర్ రామ్మోహన్, ఏఈ సంపత్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలి: వైసీపీ



ర్యాలీలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ఆపాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నగరంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ప్రజా ఉద్యమం పేరుతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత మాట్లాడుతూ... వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక 10 కళాశాలలను తన బినామీలు, బంధువులకు కట్టబెట్టేందుకు ప్రైవేట్ పరం చేయడానికి జీవో విడుదల చేశారన్నారు. ఇలా చేయడం వల్ల పేదలకు వైద్య విద్యతో పాటు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉండదన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణకు ప్రజా ఉద్యమం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు తగ్గేది లేదన్నారు. జీవోను వెనక్కు తీసుకుని మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓ కుల్లాయప్పకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాసులు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్ర, నగరాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో ర్యాలీ..

శింగనమల: నియోజకవర్గ కేంద్రమైన శింగనమలలో వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక దర్గా నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందని, దీనిని వెంటనే ఉపసంహరించాలని అన్నారు. లేకపోతే ప్రజాగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కన్వీనర్ పూలప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న లక్ష్మీదేవి

అనంతపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మున్సిపాల్టీలు ఇతరత్రా వాటి అభివృద్ధికి సహకరించాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రావూరి లక్ష్మీదేవి కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. ఆమేరకు బుధవారం సాయంత్రం ఆమె కలెక్టర్‌ను కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. నెల్లూరులో రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి నారాయణ చేపడుతున్న తరహాల్లో ఈ జిల్లాలోనూ అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని కోరారు.

ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన

అనంతపురంరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఎంటర్‌ప్రెన్యూర్షిప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాదు ఎంఎస్ఎంఈ అధికారి రాజేశ్వరి శిక్షకులుగా హాజరయ్యారు. వర్సిటీ ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. వర్తమాన, భవిష్యత్తు వ్యాపార అవకాశాలు, స్టార్టప్‌లు, పారిశ్రామికాభివృద్ధి వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం ఎంఎస్ఎంఈ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుండి సర్టిఫికెట్లు విద్యార్థులు అందుకున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనాల విడుదలపై హర్షం

అనంతపురం విద్య, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇమామ్,మౌజన్లకు గౌరవవేతనాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. బుధవారం అధికారికంగా ఉత్తర్వులు విడుదలచేయడం పట్ల ముతవల్లీల సంఘం అధ్యక్షుడు షకీల్‌షఫీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతజిల్లాలో 292మంది, సత్యసాయిజిల్లాలో 302మంది ఇమామ్, మౌజన్లు ఉన్నారని, వీరందరికీ గౌరవవేతనం మంజూరైందని చెప్పారు.

అక్రమాలపై విచారణ చేయించాలని వినతి



మంత్రి కేశవ్‌కు వినతిపత్రం ఇస్తున్న క్రీడాకారుల తల్లిదండ్రులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సెలెక్షన్స్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని క్రీడాకారుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్‌ను బుధవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. జిల్లా అండర్-14 బాలుర జట్టు సెలెక్షన్స్‌లో భారీగా అక్రమాలు జరిగాయని, అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. క్రీడాకారుల తల్లిదండ్రులు మాసినేని అమరేంద్ర, చంద్రశేఖర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు

- ఏఎంసీ ఏసీపీ నీరజాక్షి హెచ్చరిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని నగరపాలక సంస్థ ఏసీపీ నీరజాక్షి హెచ్చరించారు. అక్రమ నిర్మాణాల తొలగింపు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం ఆమె టీపీఎస్ మంజుల, సిబ్బందితో కలిసి స్థానిక రహమత్‌నగర్ ప్రధాన రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవనాన్ని తొలగింపజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, కమిషనర్ బాలస్వామి సూచనల మేరకు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను తొలగిస్తామని తెలిపారు. అనుమతి లేకుండా, రోడ్డుకు అడ్డంగా కట్టిన నిర్మాణాలను ఆయా యజమానులు స్వచ్ఛందంగా తొలగించాలన్నారు. లేని పక్షంలో పోలీసులు, తమ సిబ్బందితో వచ్చి తొలగిస్తామని హెచ్చరించారు. కొత్తగా నిర్మాణం చేపట్టే యజమానులు పూర్తిస్థాయిలో అనుమతులు తీసుకోవాలని సూచించారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. నాగమద్దయ్య మాట్లాడుతూ... మద్యంషాపుల్లో మద్యం అమ్మకాలు సురక్ష యాప్ ద్వారానే జరిగేలా చూడాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఎక్సైజ్ ఎస్ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలను అడ్డుకున్న ఏబీవీపీ

అనంతపురంరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలోని ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాల్లో బుధవారం జరుగుతున్న క్రిస్మస్ వేడుకలను ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో మత కార్యకలాపాలను బాహాటంగా జరపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం వర్సిటీ వీసీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమం చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని వీసీ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు యుగంధర్, దివాకర్‌నాయక్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహారుద్ర - సహస్ర శంఖాభిషేకం



మాట్లాడుతున్న అప్పాస్వామి


అనంతపురం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శివకోటి ఆలయంలో ఈనెల 14 నుంచి 17వతేదీ వరకు మహారుద్ర-సహస్ర శంఖాభిషేకం నిర్వహించనున్నట్లు శివకోటి శ్రీపీఠం వ్యవస్థాపకుడు అప్పాస్వామి పేర్కొన్నారు. శివకోటి ఆలయ ఆవరణలోని సమావేశమందిరంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మహారుద్ర-సహస్ర శంఖాభిషేకం కార్యక్రమ ట్రైలర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... 14 నుంచి 17వ తేదీ వరకు విశిష్టమైన శివారాధన కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టినట్లు పేర్కొన్నారు. భక్తులు విశేషంగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. శివకోటి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఏమిటీ.. అల్లరి?

- వైసీపీ ర్యాలీలో పెద్దఎత్తున డీజే శబ్దాలు
- పాఠశాల సమీపంలో డీజే వాహనం చక్కర్లు
- అసౌకర్యానికి గురైన విద్యార్థులు



శబ్దం చేస్తూ చక్కర్లు కొడుతున్న డీజే వావానం



అసౌకర్యంగా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

శింగనమల, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు బుధవారం పరీక్షలు రాస్తుండగా వైసీపీ ర్యాలీ కోసం ఏర్పాటు చేసిన ఓ వాహనం డీజే సౌండ్‌తో అటు ఇటూ చక్కర్లు కొట్టింది. దీంతో ఆ శబ్దానికి విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఏ-1 పరీక్షల్లో భాగంగా ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు ఇంగ్లీష్ పరీక్ష నిర్వహించారు. అదే సమయంలోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం పేరిట ర్యాలీ చేపట్టారు. ఇందులో డీజే వాహనం పెద్దఎత్తున సౌండ్ చేసుకుంటూ కళాశాల సమీపంలో చక్కర్లు కొట్టింది. దీంతో విద్యార్థులు పరీక్ష రాసేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు పరీక్షలు రాస్తుంటే ఈ డిస్టబెన్స్ ఏమిటని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏపార్టీలు అయినా ర్యాలీలు, సభలు జరిగే సమయంలో తప్పని సరిగా పోలీసులు, రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి. నిశ్శబ్ద ప్రాంతాల్లో (ఆసుపత్రులు,పాఠశాల వద్ద) 40 నుంచి 50 డీబీ సౌండ్‌కు మంచకుండా అనుమతులు ఇస్తారు. ఇక్కడ వైసీపీ నాయకులు కేవలం ర్యాలీకి మాత్రమే అనుమతులు తీసుకుని, డీజేలు, సైలెన్సర్లు లేని బైక్‌లతో ర్యాలీలు చేసినట్లు సమాచారం. ఈ శబ్దాలు విన్న సీఐ కౌలుట్లయ్య వైసీపీ శ్రేణుల ర్యాలీని అడ్డగించారు. డీజేకు, బైక్‌ర్యాలీకి అనుమతులు లేవంటూ మండిపడ్డారు. సౌండ్ డిస్టబెన్స్ వల్ల పరీక్షను సక్రమంగా రాయలేదని విద్యార్థులు కొందరు ఆవేదన వ్యక్తం చేశారు.

'వైసీపీది అనవసర రాద్ధాంతం'



మాట్లాడుతున్న కార్పొరేషన్ డైరెక్టర్లు

అనంతపురం క్రైం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలపై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందంటూ...పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, టీడీపీ నాయకులు మండిపడ్డారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేష్, నాయీ బ్రాహ్మణ కార్పొరేష్ డైరెక్టర్ కడియాల కొండన్న మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి నిధులను పక్కకు మళ్లించారన్నారు. నాడు అర్ధంతరంగా ఆపేసి నేడు అనవసరంగా రాజకీయం చేస్తూ... శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఆందోళన చేస్తున్నారంటూ మండిపడ్డారు. కాలేజీలను పీపీపీ మోడ్‌లో పూర్తి చేసి వైద్యవిద్యను తమ అధీనంలోనే ఉంచుకుని ఉచిత సీట్లను పెంచుతామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ వైసీపీ నాయకులు అవేవీ పట్టించుకోకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వారి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

ఆస్పత్రి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం వైద్యం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఏఎంసీ వార్డుకు విద్యుత్‌ను సరఫరా చేసే వైర్లను కత్తిరించిన దుండగల ఆచూకీ దొరకలేదు. ఈ ఘటనపై రెండో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆస్పత్రి సెక్యూరిటీ సిబ్బంది, పోలీస్ శాఖ అధికారులు సీసీ కెమెరాలను పరిశీలించారన్నారు. ఆస్పత్రిలో భద్రతను పెంచాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి కోరారు. ఈ మేరకు ఆయన ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, అజయ్, నారాయణస్వామి, కదరయ్య పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం విద్య, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు నగరంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు పరమేష్, శివ, విజయ్ జయవర్ధన్ మాట్లాడుతూ ఈనెల 3వతేదీ నుంచి జిల్లాలో 5రోజులు పాటు పర్యటించి హాస్టల్ సమస్యలను తెలుసుకున్నామన్నారు. చాలా హాస్టళ్లలో కనీస వసతులు లేవన్నారు. వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నష్టపోయిన వారికి న్యాయం చేయండి

అనంతపురంరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో గత ప్రభుత్వంలో అప్పటి ఉపకులపతి రామకృష్ణారెడ్డి అక్రమంగా విధించిన సస్పెన్షన్ల వల్ల నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయాలని బోధనేతర ఉద్యోగ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అనితను బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప, కార్యదర్శి మారుతీ, డిప్యూటీ రిజిస్ట్రార్ లక్ష్మీరామ్‌నాయక్, సూపరింటెండెంట్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఏఎంసీ సెక్రటరీగా సునీత బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థ సెక్రటరీగా సునీత బాధ్యతలు స్వీకరించారు. ప్రొద్దుటూరులో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. దీంతో బుధవారం సంస్థ కార్యాలయంలో కమిషనర్ బాలస్వామిని కలిసి బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు సెక్రటరీగా ఉన్న రంగస్వామి గత నెలలో మైదుకూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్

అనంతపురం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కేఎస్ఏఆర్ గఫూర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ అర్షద్ అయూబ్ జ్ఞాపకార్థం ఆ ఆస్పత్రి యాజమాన్యం స్థానిక బెరాక వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ఆస్పత్రి ఆవరణలో బుధవారం వృద్ధాశ్రమ నిర్వాహకుడు శ్రీరాములుకు నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు, వృద్ధుల కోసం మందులను డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది మమతా, షబ్బీర్, మల్లేశ్వరి, నవ్య, హారిక, సావిత్రి పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌కే, సచివాలయంలో సామగ్రి చోరీ

రాప్తాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయంలోని సామగ్రిని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సచివాలయంలో కిటికీలు ధ్వంసం చేసి యూపీఎస్‌కు సంబంధించిన రెండు బ్యాటరీలు, ఫైబర్‌నెట్‌కు సంబంధించిన రెండు బ్యాటరీలు చోరీ చేశారు. రైతు సేవా కేంద్రంలో 43 ఇంచుల ఎల్ఈడీ టీవీని అపహరించారు. పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ శ్రీహర్ష బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రేపు టింబక్టు కలెక్టివ్ వార్షికోత్సవాలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి):టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ 35వ వార్షికోత్సవ వేడుకలు మండలకేంద్రంలోని కృష్ణమందిరం వద్ద ఈనెల 14వ తేదీన ఘనంగా జరగనున్నాయని ఆ సంస్థ వ్యవస్థాపకుడు బబ్లూ గంగూలి తెలిపారు. విజయవంతం చేయాలని బుధవారం స్థానిక సంస్థ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాప్తాడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన మండల కేంద్రానికి చెందిన మంగళ శ్రీనివాసులు (45) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. శ్రీనివాసులు ఈనెల 7వతేదీ రాత్రి 7 గంటల సమయంలో రాప్తాడు నుంచి అనంతపురానికి బైక్‌లో బయలుదేరాడు. ప్రసన్నాయపల్లి క్రాస్ వద కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. హైవే పోలీసులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన చికిత్స కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అతను మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాప్తాడు సీఐ శ్రీహర్ష తెలిపారు.

మట్కా బీటర్‌పై కేసు

అనంతపురం క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో మహిళా మట్కా బీటర్‌పై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక గుత్తి రోడ్డులోని ఫైలాన్ సర్కిల్ వద్ద బుధవారం తనిఖీలు చేస్తుండగా.. పద్మావతి అనే మహిళపై అనుమానం కలిగిందని, వెంటనే ఆమె ద్విచక్రవాహనాన్ని తనిఖీ చేశామని, అందులో మట్కా స్లిప్పులు, కార్బన్ పేపర్లు, రూ. 15 వేల నగదు ఉన్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. ఆ తర్వాత వాటిని సీజ్ చేసి ఆమెపై కేసు నమోదుచేశామని చెప్పారు.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL
(On the file of the 1st Addl.District Judge)
ANANTHAPURAMU.
I.A.No.1042/2025 in M.V.O.P.No.53/2018

Between:
JanagondaKondappa ...Petitioner/Petitioner
AND
1) G.Kristaiah & 3 Others
...Respondents/ Respondents

NOTICE TO RESPONDENT NO - 4

To,
R4 - డి.ఆనంద్ S/o డి.చిన్న ఓబిలేసు, ఇంటి.నెం.3/289, యల్లనూరు గ్రామం & మండలం, అనంతపురం జిల్లా. (ఇన్సూరెన్స్ పాలసీ హోల్డర్)

పై నెంబరు దావాలోని 4వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము పై కోర్టువారు 27-11-2025వ తేది ఉదయం 10-30గంటలకు వాయిదా వేసినారు. కావున ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ హాజరై ఏమైనా అక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మాణము చేయబడును.
" కోర్టు వారి ఉత్తర్వుల మేరకు "

పి.చెన్నారెడ్డి, అడ్వకేట్
అనంతపురం. సెల్: 9440093880

న్యూస్ బాక్స్

పేదలకు బియ్యం తగ్గిస్తే సహించను: ఎమ్మెల్యే



ఎమ్మెల్యేతో రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్

తాడిపత్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని తూకం తగ్గించి ఇస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయనీ, బియ్యం తగ్గించి ఇస్తే సహించేది లేదని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, డీలర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. తమకు గోడౌన్ నుంచి బియ్యం తక్కువగా ఇస్తున్నారని కొందరు డీలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు మాట్లాడుతూ.. చాలా కాలం నుంచి కాటా లేకపోవడంతో 50 కేజీల ప్యాకెట్‌లో రెండు కేజీల వరకు తక్కువగా వస్తున్నాయని వివరణ ఇచ్చారు. కాటా లేకుండా ఎలా పనిచేస్తున్నారని అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. తన సొంత ఖర్చులతో త్వరగా కాటాను ఏర్పాటు చేస్తానని, తూకాల్లో తేడాలు లేకుండా డీలర్లకు అందజేయాలని, లేకుంటే వారి పైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు కొంత తగ్గించి ఇస్తే.. డీలర్లు మరింత తగ్గించి బియ్యాన్ని ఇస్తున్నారని, దీంతో పేదలకు బియ్యం అందడం లేదని, దీంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

● **రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్‌తో భేటీ**

స్థానిక ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాసంలోరాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి బుధవారం భేటీ అయ్యారు. తన నియోజకవర్గంలో చాలామంది రజకులు ఉన్నారని, వారికి రజక కార్పొరేషన్ ద్వారా పనిముట్లు, యంత్రాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చైర్‌పర్సన్‌ను కోరారు.

పనిచేసే వారికి టీడీపీలో గుర్తింపు: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

గుంతకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి పనిచేసిన కార్యకర్తలను టీడీపీ అధిష్ఠానం గుర్తించి.. తప్పకుండా పదవులు ఇస్తుందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణాల పార్టీ కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివిధ కమిటీలలో నియమితులైనవారు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు పాల్గొన్నారు.

● చెక్కుల పంపిణీ: నియోజకవర్గంలోని 26 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.17.48 లక్షలు మంజూరయ్యాయి. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే బాధితులకు అందజేశారు.

సీసీ రోడ్డు ప్రారంభం

గుత్తిరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండలో నరసింహస్వామి గుడి వద్ద రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, ఆసుపత్రి కమిటీ సభ్యుడు చికెన్ శీనా, టీడీపీ సీనియర్ నాయకులు, బర్దీవలి, కరిడికొండ సూరీ, చిన్నరెడ్డి యాదవ్, సుధాకర్ నాయుడు, ప్రభాకర్‌నాయుడు, తిమ్మప్ప, రామకృష్ణ, పంచాయితీ రాజ్ డీఈఈ మురళీధర్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

డీ.హీరేహాళ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యకర్త కుంజలి బీమన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కలిగి ఉండటంతో ప్రమాద బీమా కింద రూ.5 లక్షలు మంజూరైంది. ఆ చెక్కును బీమన్న కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు బుధవారం అందజేశారు. అలాగే మండల కేంద్రంలో కొన్ని రోజుల క్రితం పార్టీ సీనియర్ నాయకుడు శీనప్ప మరణించగా.. అతని కుటుంబ సభ్యులను విప్ పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీరాములు, సాయి, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, రామాంజినేయులు, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

● **విప్‌కు కృతజ్ఞతలు**

కణేకల్లు: తనకు డైరెక్టర్ పదవి ఇచ్చినందుకు రాష్ట్ర ఉప్పర సంఘం డైరెక్టర్ ఆనంద్‌రాజ్ విప్ కాలవను రాయదుర్గంలో కలిసి.. కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు లాలెప్ప, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, వన్నారెడ్డి, మాబుసాబ్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు, నాగప్ప, ఈరప్ప, నజీర్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

ప్రసాదాలకు రూ.3 లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న సుధాకర్

గుంతకల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన మణికంఠ గ్యాస్ సర్వీస్ నిర్వాహకుడు సుధాకర్ కసాపురం దేవస్థానంలో ప్రసాదాల కోసం రూ.3 లక్షలను విరాళంగా ఇచ్చారు. కసాపురం దేవస్థానంలో ఈఓ విజయరాజుకు ఆ చెక్కును బుధవారం ఆయన అందజేశారు.

ఎస్ఐకి అవార్డు



విడపనకల్లు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో క్రైం రేటు తగ్గించినందుకు స్థానిక ఎస్ఐ ఖాజాహుస్సేన్‌కు ఉత్తమ ఎస్ఐగా అవార్డు అందుకున్నారు. అనంతపురంలోని ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఆయనకు ఎస్పీ జగదీష్ ఆ అవార్డును అందజేశారు. దీంతో బుధవారం ఎస్ఐని స్థానిక పోలీస్ సిబ్బంది, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు సన్మానించారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఉపాధ్యక్షుడిగా రమేష్‌బాబు



తాడిపత్రి, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఏపీ నాయిబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాన్ని గుంటూరులో మంగళవారం నిర్వహించారు. అందులో తనను ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండలంలోని యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రమేష్‌బాబు బుధవారం తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసన



కుందుర్పి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కనసయ్యగుట్ట కాలనీలో 15 రోజులుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు బుధవారం ఖాళీ బిందెలతో రాస్తారోకో చేశారు. సమస్యను స్థానిక ఎంపీడీఓ అధికారులకు తెలపాలని పోలీసులు సూచించడంతో వారు ఎంపీడీఓ కార్యాలయ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ బాలాజీ మాట్లాడుతు.. సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని, అంతవరకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

పేదలందరికీ సొంతిళ్లు: విప్

రాయదుర్గం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు స్పష్టంచేశారు. మూడు లక్షల ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పక్కా ఇళ్లను బుధవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. పేదల గృహనిర్మాణ పథకా న్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆశలు మళ్లీ చిగురించాయని అన్నారు.



రాయదుర్గంలో గృహాన్ని ప్రారంభిస్తున్న విప్ కాలవ

● గుంతకల్లు : స్థానిక తొమ్మిదో వార్డులో మూడు లక్షల ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమంలో భాగంగా నూతన ఇళ్లను టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు నయ్యూం అహ్మద్, టీడీపీ నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, బండారు ఆనంద్, పాల మల్లికార్జున, లక్ష్మీనారాయణ, ఫజులు, జగన్నాథ్, అంజి పాల్గొన్నారు.

● కుందుర్పి : మండలంలోని అపిలేపల్లిలో నూతన గృహాలను గృహనిర్మాణ శాఖ డీఈ విజయభాస్కర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఓబులేష్, హౌసింగ్ ఏఈ మారు తి, గ్రామ కన్వీనర్ ఈరన్న, మండల మా జీ కన్వీనర్ కేపీ రామాంజినేయులు స్టోర్ డీలర్ విరుపాక్షి, టీడీపీ నాయకులు ఓబులేష్, హనుమంతరాయుడు, చిరంజీవి, రామిరెడ్డి, నాగరాజు, రామాంజినేయులు మల్లికార్జున పాల్గొన్నారు.





గుంతకల్లులో ఇంటి తాళం చెవి నమూనాను అందజేస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి, అపిలేపల్లిలో గృహప్రవేశ కార్యక్రమంలో డీఈ

మహిళ ఆత్మహత్య



లీలావతి (ఫైల్)

గుంతకల్లుటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన పెద్ద వీరన్న భార్య చాకలి లీలావతి (50) బావిలో దూకి బుధవారం ఆత్మహత్య చేసుకుంది. పెద్ద వీరన్న దోబి పనులు చేసేవాడు. లీలావతి గంగానగర్‌లో కిరాణాషాపు పెట్టుకుంది. షాపు, కుటుంబ నిర్వహణకు ఆమె అప్పులు చేసింది. ఈ విషయం ఎక్కడ భర్త, కొడుకులు, కోడళ్లకు తెలుస్తుందోనని భయపడిన ఆమె.. మంగళవారం ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు పలు గాలించినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం ఉదయం స్థానిక హౌసిగ్ బోర్డు కాలనీలోని నాగసముద్రం బావిలో ఆమె మృతదేహం తేలుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు కుటుం సభ్యులకు, వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇరువర్గాల ఘర్షణ - పది మందికి గాయాలు

డీ. హీరేహాళ్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళ్యం గ్రామంలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో సుమారు 10 మంది గాయపడ్డారు. గతంలో ఇరువర్గాల మధ్య గొడవల వల్ల మనస్పర్థలున్నాయి. ఈ తరుణంలో రెండు నెలలలో గ్రామంలో బయలాట నాటకం వేయడం కోసం బుధవారం రాత్రి గ్రామస్థులు సమావేశమయ్యారు. ఇందులో ఇరువర్గాల మధ్య మాటా.. మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. కట్టెలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో మంజు, శివ, చౌడప్ప, పెన్నయ్య, వన్నూరుస్వామి, చిత్రయ్య, ఆంజనేయులు, బలరాం, నాగరాజు, తిప్పేస్వామి తదితరులు గాయపడ్డారు. ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో వెంటనే కళ్యం గ్రామానికి చేరుకొని.. ఇరువర్గాలను చెదరగొట్టారు. గాయపడ్డ వారిని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

దుకాణంలో చోరీ

ఉరవకొండ, నవంబరు12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఉన్న శివగంగ కూల్ డ్రింక్స్ షాపులో మంగళవారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. రూ.17వేలు విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు, రూ. 5 వేలు ఎత్తుకెళ్లారని షాపు యజమాని రాజ్‌కుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడిపత్రి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో గురు, శుక్ర, శని వారాల్లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు ఏడీ ప్రభాకర్‌రావు బుధవారం తెలిపారు. దీంతో ఈ మూడు రోజుల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగవచ్చని, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ముగిసిన కడ్లే గౌరమ్మ ఉత్సవాలు



గోవిందవాడలో కడ్లేగౌరమ్మ ఊరేగింపు

బొమ్మనహాళ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ, చంద్రగిరి గ్రామాల్లో మూడురోజులు పాటు నిర్వహిస్తున్న కడ్లేగౌరమ్మ ఉత్సవాలు ముగిశాయి. బుధవారం తెల్లవారుజమున కడ్లే గౌరమ్మ విగ్రహాలను ప్రత్యేక రథంలో ఊరేగించి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చెక్కభజన, కోలాటాలు, భజనలు, డప్పు వాయిద్యాలతో గ్రామాలు మార్మోగాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, ఎస్‌జీ వన్నూరుస్వామి, రాతింటి వన్నూరుస్వామి, సుంకన్న, ధనంజయ్యరెడ్డి, చంద్రారెడ్డి, చింతకుంట చంద్రారెడ్డి, పుల్లరెడ్డి , బలరాం పాల్గొన్నారు.

ఘనంగా ఆవుల దేవర

రాయదుర్గంరూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదంగొల్లలదొడ్డిలో ఆవుల దేవర మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. యాదవుల ఆరాధ్యదైవమైన ఎర్రినాగముత్తప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ఊరిబయటకు తీసుకెళ్లి.. గంగ పూజ నిర్వహించారు. అనంతరం ఆవులగూడు ఏర్పాటు చేసి స్వామివారిని ప్రతిష్ఠించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆవులగూడు చుట్టూ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, ఎద్దులను తిప్పారు. అనంతరం గ్రామంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

యాడికిలో ఉద్రిక్తత



యాడికి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

యాడికి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): యాడికిలో బుధవారం వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించే కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొంటున్నారనే ప్రచారం జరగడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు యాడికిలోని వైసీపీ కార్యాలయానికి తరలివచ్చారు. పెద్దారెడ్డి యాడికి వస్తే అడ్డుకోవడానికి టీడీపీ శ్రేణులు కూడా భారీగా టీడీపీ కార్యాలయం వద్దకు తరలివచ్చారు. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందారు. తాడిపత్రిలో కేతిరెడ్డి పెద్దారెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వైసీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పీపీపీ విధానాన్ని రద్దు చేయాలి

గుంతకల్లుటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల నిర్మాణంలో పీపీపీ విధానం కాకుండా.. రాష్ట్ర ప్రభుత్వమే ఆ నిర్మాణాలను పూర్తి చేయాలని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ పరిశీలకుడు తిప్పేస్వామి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి చినబాబు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటిని ఏర్పాటు చేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విడపనకల్లు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదర్శ పాఠశాలలో అనేక నెలలుగా తాగునీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై ఆదర్శ హస్టల్‌లో తాగు నీటి కష్టాలు అనే పేరుతో ఆంధ్రజ్యోతి మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బుధవారం ఆదర్శ పాఠశాలలో బోర్లకు మరమ్మతులు చేయించారు. ఫిల్టర్ ట్యాంక్‌లకు ద్వారా తాగునీరు అందేలా కనెక్షన్లు ఇచ్చారు. దీంతో విద్యార్థులకు కొంత మేరకు తాగునీటి కష్టాలు తీరినట్లు అయింది. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ముజామిల్, పాఠశాల ప్రిన్సిపాల్ శశికళ పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌కు పలు ఫిర్యాదులు

గుంతకల్లుటౌన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలూరు రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద బుధవారం సాయంత్రం విద్యుత్ గుత్తి డివిజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటైర్డ్ న్యాయాధికారి శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు మధుకుమార్, స్వాతంత్ర సభ్యులు విజయలక్ష్మి, విద్యుత్ డీఈ పద్మానాభపిళ్లై ప్రజల నుంచి 30 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏడీఈ నాగేంద్ర, ఏఏఓ యుగంధర్, ఏఈలు రఘు, ప్రసన్నకుమార్, మన్సన్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన

డీ.హీరేహాళ్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారి పనులను డిప్యూటీ కలెక్టర్ శివనారాయణశర్మ, ఆర్డీఓ వసంతబాబు బుధవారం పరిశీలించారు. ఫ్లైఓవర్ పనులు పలు సమస్యల వల్ల మూడు సంవత్సరాలుగా ఆగిపోయాయి. అందుకు కారణమైన వారితో జేసీ మాట్లాడారు. ఇల్లు, భవనాలు కోల్పోయిన వారి అకౌంట్‌లోకి త్వరలోనే సొమ్ము జమ అవుతుందని, కావున ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ వంశీ, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

● **రెవెన్యూ కార్యాలయం తనిఖీ**

బొమ్మనహాళ్: స్థానిక రెవెన్యూ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ బుధవారం తనిఖీ చేశారు. మండలంలో రైతుల భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక అధికారులపై మండిపడ్డారు. కొందరు అధికారులు అందుబాటులో లేకపోవడంపై మండిపడ్డారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ మునివేలు ఉన్నారు.

నేడు వైద్యశిబిరం

బొమ్మనహాళ్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) మండలంలోని శ్రీనివాస్‌క్యాంప్ గ్రామంలో గురువారం కిడ్నీ, చర్మవ్యాధులకు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, నాయకులు మల్లీడు శ్రీనివాసులు తెలిపారు. దీన్ని విప్ కాలవ ప్రారంభిస్తారని, గ్రామస్థులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విజేత విద్యార్థులతో పీడీ

రాయదుర్గం రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయిలో నెట్‌బాల్ పోటీలో మండలంలోని ఆవులదట్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు నేత్రావతి, సుధీర్‌నాయక్, స్వాతి, లక్ష్మీబాయి ప్రతిభ చాటారు. ఈనెల 15, 28 తేదీల్లో ఈస్ట్‌గోదావరి, వెస్ట్ గోదావరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్ఎం విజయభారతి, పీడీ శివశరణ్ బుధవారం తెలిపారు.

కురాష్ పోటీల్లో ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

పుట్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలోని మాంటిస్సోరి మైదానంలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కురాష్ పోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నాగేష్, నరేష్ వెండి పతకాలు సాధించారు. వారిని వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, విద్యాధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు చెరువులకు హెచ్చెల్సీ నీరు

పుట్లూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బరాయసాగర్ నుంచి కాలువ ద్వారా మండలంలోని మూడు చెరువులకు గురువారం హెచ్చెల్సీ నీరు విడుదల చేస్తున్నట్లు మండల టీడీపీ నాయకుడు చవ్వా కులశేఖర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొంటారని, పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులతో పాటు 29వ డిస్ట్రిబ్యూటర్ ద్వారా బొప్పేపల్లి చెరువుకు నీటిని విడుదల చేస్తారన్నారన్నారు.

బహిరంగ ప్రకటన

తేది:13-11-2025

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కొనకొండ్ల గ్రామంలో ఉన్న మొత్తం భూమిని దిగువ పేర్కొన్న యజమానుల నుండి కొనుగోలు/లీజుకు తీసుకోవాలని మా క్లయింట్ ఉద్దేశిస్తూ ఈ ప్రకటన ఇవ్వడమైనది.

క్ర. సం.	మండలం	గ్రామం	సర్వేనెం.	విస్తీర్ణం (ఎకరాలలో)	ప్రస్తుత యజమాని
1)	వజ్రకరూరు	కొనకొండ్ల	993-ఎ1	5.00	ప్రకాష్
2)	వజ్రకరూరు	కొనకొండ్ల	993-ఎ1	4.53	కాకర్ల భారతి
3)	వజ్రకరూరు	కొనకొండ	994-1ఎ1	2.50	సిగరగట్ల ఎర్రిస్వామి
4)	వజ్రకరూరు	కొనకొండ్ల	994-ఎ1	5.20	కె.నంజమ్మ
5)	వజ్రకరూరు	కొనకొండ్ల	994-ఎ1	2.50	బంగారయ్య గారి సరోజ
6)	వజ్రకరూరు	కొనకొండ్ల	994ఎఎ-2	2.40	బంగి గణేష్
7)	వజ్రకరూరు	కొనకొండ్ల	994-బి	1.01	దూదేకుల మస్తాని
8)	వజ్రకరూరు	కొనకొండ్ల	995-బి	2.50	తరిగోపుల హనుమేష్
9)	వజ్రకరూరు	కొనకొండ్ల	995-బి	1.24	పొత్తూరు రోసి
10)	వజ్రకరూరు	కొనకొండ్ల	996-ఎ	1.01	దూదేకుల మస్తాని
11)	వజ్రకరూరు	కొనకొండ్ల	996-బి/ఎ	1.76	తరిగోపుల అశోక్‌కుమార్
12)	వజ్రకరూరు	కొనకొండ్ల	996-బి/బి	3.77	తరిగోపుల విజయశ్రీ
13)	వజ్రకరూరు	కొనకొండ్ల	997	2.49	తిమ్మినేని రఘుప్రసాద్
14)	వజ్రకరూరు	కొనకొండ్ల	997	7.77	టి.రామేశ్వర్
15)	వజ్రకరూరు	కొనకొండ్ల	997-బి	3.70	తరిగోపుల లక్ష్మీదేవి
16)	వజ్రకరూరు	కొనకొండ్ల	997-సి	7.75	తరిగోపుల జానమ్మ
17)	వజ్రకరూరు	కొనకొండ్ల	998-ఎ	7.65	బోయపాటి నరేంద్రప్రసాద్
18)	వజ్రకరూరు	కొనకొండ్ల	998సి	5.71	పత్తిపాటి గురుశరణ్
19)	వజ్రకరూరు	కొనకొండ్ల	998సి	5.71	పత్తిపాటి గురుస్వరూప్
20)	వజ్రకరూరు	కొనకొండ్ల	998డి	4.88	పత్తిపాటి కమలమ్మ
21)	వజ్రకరూరు	కొనకొండ్ల	998-బి1	1.11	బోయ లక్ష్మీస్వామి
22)	వజ్రకరూరు	కొనకొండ్ల	998-బి1	1.73	టి.నాజిర్‌ఖాన్
23)	వజ్రకరూరు	కొనకొండ్ల	998-బి3	3.26	బోయ లక్ష్మీస్వామి
24)	వజ్రకరూరు	కొనకొండ్ల	999-ఎ1ఎ	1.30	బోయపాటి దేవిప్రసాద్
25)	వజ్రకరూరు	కొనకొండ్ల	999-ఎ1బి1	7.25	బోయపాటి రంజిత్‌కుమార్
26)	వజ్రకరూరు	కొనకొండ్ల	999-ఎ1బి2	10.14	లీలావతి
27)	వజ్రకరూరు	కొనకొండ్ల	999-బి	7.51	బోయపాటి సంజీవనాయుడు
28)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000-4	3.76	తపిల చిన్న ఓబులేసు
29)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000-ఎ	1.57	చలాక్షి నారాయణ
30)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000బి	2.74	మంగమ్మ
31)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000బి	4.00	తిమ్మప్ప
32)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000బి	2.15	హరిజన ఓబిలేసు
33)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000బి	2.15	కందిగోపుల కుళ్ళాయప్ప
34)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000బి	2.00	నంచర్ల పెద్దయ్య
35)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000బి/4	3.80	గుడిసి సరోజ
36)	వజ్రకరూరు	కొనకొండ్ల	1000బి-6	4.62	నంచర్ల సుంకమ్మ
37)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-బి	6.45	బీరల రంగారెడ్డి
38)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-సి	10.29	పత్తిపాటి చంద్రశేఖర్‌నాయుడు
39)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-సి	5.49	కురవ లింగరాజు
40)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-ఇ/ఎ	1.58	మాలపాటి రామచంద్రనాయుడు
41)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-ఇ/బి	1.59	మాలపాటి రాజగోపాల్
42)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001సి-ఎ	10.29	పత్తిపాటి చంద్రశేఖర్‌నాయుడు
43)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001/జి/ఎ	1.50	బోయ పార్వతి
44)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001/జి/బి	1.50	బోయ పార్వతి
45)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001జి-సి	2.25	బోయ శ్రీనివాసులు
46)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-ఎఫ్	3.21	బి.శారదమ్మ
47)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-జి/ఇ	1.50	బోయ హనుమాన్
48)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-జి/ఇ	0.45	బోయ లక్ష్మి
49)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-జి/ఇ	1.00	బోయ లక్ష్మి
50)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-జి/ఇ	1.10	జంగా గురుస్వామి
51)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-జి/ఇ	1.65	ప్రశాంత్ కుమార్
52)	వజ్రకరూరు	కొనకొండ్ల	1001-జి/ఇ	0.90	బెలగల్ల కిషోర్ కుమార్
53)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-ఎ	1.52	వి.పద్మలత
54)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-ఎ1	4.00	మంగమ్మ
55)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002సి/ఎ	4.03	పత్తిపాటి రంగప్ప
56)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002బి/ఎ	0.60	రామానాయుడు
57)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-సి/బి	4.02	పత్తిపాటి యశోదమ్మ
58)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002బి/సి	2.33	గుడిసి సరోజ
59)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002బి-డి	2.33	జి.లక్ష్మమ్మ
60)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-బి2	1.00	గుమ్మనూరు శివయ్య
61)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-బి2	2.75	గుమ్మనూరు అర్జున్
62)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-బి2	0.92	గుమ్మనూరు రాజు
63)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-బి2ఎ	1.00	గుమ్మనూరు లక్ష్మీదేవి
64)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-బి2ఎ	1.36	గుమ్మనూరు రాజు
65)	వజ్రకరూరు	కొనకొండ్ల	1002-బి2బి	2.28	గుమ్మనూరు దేవరాజు
66)	వజ్రకరూరు	కొనకొండ్ల	1003ఎ	5.04	దూదేకుల చిన్న అబ్దుల్లా
67)	వజ్రకరూరు	కొనకొండ్ల	1003-డి	4.25	పత్తిపాటి రంగప్ప
68)	వజ్రకరూరు	కొనకొండ్ల	1003-బి	4.58	పింజరి పెద్ద అబ్దుల్
69)	వజ్రకరూరు	కొనకొండ్ల	1003ఇ/ఎ	7.49	గుడిసి లీలమ్మ
70)	వజ్రకరూరు	కొనకొండ్ల	1003-డి/ఎ	0.61	పత్తిపాటి యశోదమ్మ
71)	వజ్రకరూరు	కొనకొండ్ల	1003-ఎ/డి	0.41	పింజరి పెద్ద అబ్దుల్
72)	వజ్రకరూరు	కొనకొండ్ల	1003సి-బి	0.28	వి.పద్మలత
73)	వజ్రకరూరు	గూళ్లపాళ్యం	234	6.00	ఉన్నం నారాయణస్వామి
		మొత్తం విస్తీర్ణం : 245.72			

పైన పేర్కొన్న యజమానులు, పైన పేర్కొన్న వారి సంబంధిత ఆస్తి అన్ని తాకట్టు రుణ బారాలు, చార్జీలు, తాత్కాలిక హక్కులు లేకుండా ఉన్నారని మరియు యజమానులు పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించి ఎటువంటి ఒప్పందాలు, లీజు, MOUs మొదలైనవాటిని కుదుర్చుకోలేదని మరియు దానిని మా క్లయింటుకు విక్రయించడానికి/లీజుకు ఇవ్వడానికి ఎటువంటి చట్టపరమైన అడ్డంకులు లేవని, దీని ఆధారంగా మా క్లయింటు పైన పేర్కొన్న ఆస్తిని కొనుగోలు చేయడానికి/లీజుకు ఇవ్వడానికి అంగీకరించడమైనది.

పైన పేర్కొన్న ఆస్తి లేదా దాని ఏదైనా భాగంలో ఏదైనా హక్కు, టైటిల్, ఆసక్తి, ప్రయోజనం, క్లెయిం, లేదా డిమాండ్ ఉన్న అందరూ/ఎవరైనా వ్యక్తి(లు) /కంపెనీలు/సంస్థలు , అధికారం, ఏజెన్సీ, వారసత్వం, తనఖా, స్వాధీనం, అమ్మకం, మార్పిడి, లైసెన్స్, బహుమతి, లీజు, తాత్కాలిక హక్కు, చార్జీ, ట్రస్టు, నిర్వహణ, వీలునామా, సౌలభ్యం, అభివృద్ధి హక్కులు, భాగస్వామ్యం, ఉమ్మడి వెంచర్, ఏదైనా కోర్టు యొక్క డిక్రీ లేదా ఆర్డర్, సముపార్జన ప్రకటన లేదా ఏదైనా ఇతర ఒప్పందం/ అవగాహన క్రింద ఈ బహిరంగ ప్రకటన జారీ చేసిన 7(ఏడు) రోజుల లోపు దిగువ పేర్కొన్న చిరునామాలో దిగువ సంతకం దారుకు రాతపూర్వకంగా తెలియజేయవలెను. లేనిచో క్లయిం మరియు/లేదా అభ్యంతరం ఏదైనా ఉన్నచో దానిని వదులుకున్నట్లు/వదిలేసినట్లు పరిగణించబడుతుంది. మరియు మా క్లయింట్ పైన పేర్కొన్న ఆస్తి యొక్క లావాదేవిని అటువంటి క్లయిం లేదా డిమాండు/అభ్యంతాన్ని ప్రస్తావించకుండా పూర్తి చేయగలుగుతారు.

శ్రీ దీపక్ చౌదరి/ డి.కౌశిక్ ప్రణవ్

అడ్వకేట్స్ (సెల్ : 9885442266,8125506521)

అడ్రస్ : JSA న్యాయవాదులు & సొలిసిటర్లు,

ఫ్లాట్.నెం. 391బి,రోడ్.నెం.81, ఫిలిమ్‌నగర్, జూబ్లీహిల్స్,

హైదరాబాద్- 500096, తెలంగాణ రాష్ట్రం.